

సీఎంపీఎఫ్ కుంభకోణంపై సీబీఐ విచారణ జరిపించాలి 8లో..

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు 8లో..



గ్రామీణ రోడ్లకు మహర్దశ

- రూ.40.33 కోట్లతో 431 రోడ్లు మంజూరు
- ఉపాధిహామీ నిధులతో నిర్మాణం
- తర్వలో ప్రారంభంకానున్న పనులు

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

జిల్లాలోని గ్రామాల్లోగల మట్టి రోడ్లకు మహర్దశ పట్టనున్నది. ఉపాధిహామీ పథకం ద్వారా జిల్లాలోని 431 సిమెంట్ రోడ్ల నిర్మాణానికి 40 కోట్ల 33 లక్షల రూపాయల నిధులు మంజూరుచేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ ముఖ్య కార్యదర్శి ఉత్తర్వులు జారీచేశారు. జిల్లాలోని పెద్దపల్లి, మంథని, రామగుండం నియోజకవర్గాల్లో ఈ పనులను చేపట్టనున్నారు. జిల్లాలో మహాత్మా గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా 1,17,396 జాబ్ కార్డులను జారీచేయగా, 2,56,869 మంది కూలీలు నమోదై ఉన్నారు. ఉపాధిహామీ చట్టం ప్రకారం కేటాయించే బడ్జెట్‌లో తప్పనిసరిగా కూలీల వేతనాల కోసం 60 శాతం, మెటీరియల్ కంపోనెంట్ కింద 40 శాతం డబ్బులను వెచ్చించాల్సి ఉంటుంది. కూలీలు ఎంత ఎక్కువ పని చేస్తే మెటీరియల్ కంపోనెంట్ కింద ఎక్కువ పనులు చేసుకోవాల్సి ఉంటుంది. ఉదాహరణకు 100 రూపాయలకు 60 కూలీలకు ఖర్చు చేస్తే, 40 రూపాయలు మెటీరియల్ కోసం వెచ్చించే అవకాశాలు కల్పించారు. మహాత్మాగాంధీ గ్రామీణ ఉపాధిహామీ పథకం గ్రామాలకు వరంగా మారింది. ప్రతి ఏటా ఉపాధి కూలీలకు పనులు కల్పించడంతో పాటు మెటీరియల్ కంపోనెంట్ పనుల కింద శాశ్వత నిర్మాణ పనులను చేపడుతున్నారు. ప్రధానంగా గ్రామాల్లో మురికి కాలువలు, సిమెంట్ రోడ్లు, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు, స్వశక్తి సంఘాల భవనాలు, గ్రామపంచాయతీ భవనాలు, అంగన్‌వాడీ భవనాలు, రైతు వేదికల వంటి పనులను చేపట్టారు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో చేపట్టిన లేబర్ కంపోనెంట్ పనుల ద్వారా జనరేట్ అయ్యే మెటీరియల్ కంపోనెంట్ కింద మొత్తం సిమెంట్ రోడ్ల పనులనే చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. ఆ మేరకు గ్రామాల వారీగా ఉపాధిహామీ కూలీలు చేపట్టిన పనుల ఆధారంగా ఆయా గ్రామాల్లోని వీధుల్లో సిమెంట్ రోడ్లను నిర్మించనున్నారు.

నామినేషన్ ప్రాతిపదికన..

మంథని నియోజకవర్గంలోని మంథని మండలంలో 88 పనులకు 8 కోట్ల 17 లక్షల రూపాయలు, కమాన్‌పూర్ మండలంలో 30 పనులకు 2 కోట్ల ఒక లక్ష రూపాయలు, రామగిరి మండలంలో 51 పనులకు 4 కోట్ల 98 లక్షల రూపాయలు, ముత్తారం మండలంలో 65 పనులకు 6 కోట్ల 55 లక్షల రూపాయలు మంజూరు చేశారు. రామగుండం నియోజకవర్గం పరిధిలోని అంతర్గాం మండలంలో 12 పనులకు 2 కోట్ల 63 లక్షల 50 వేల రూపాయలు, పాలకుర్తి మండలంలో 24 పనులకు 3 కోట్ల 79 లక్షల రూపాయలు, ధర్మారం మండలంలో 24 పనులకు 2 కోట్ల 60 లక్షల రూపాయలు, ధర్మపురి నియోజకవర్గం పరిధిలోని ధర్మారం నియోజకవర్గంలో 24 పనులకు 2 కోట్ల 60 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలోని పెద్దపల్లి మండలంలో 31 పనులకు 2 కోట్ల 25 లక్షల రూపాయలు, జూలపల్లి మండలంలో 16 పనులకు 95 లక్షల రూపాయలు, సుల్తానాబాద్ మండలంలో 29 పనులకు కోటి 85 లక్షల రూపాయలు, ఓదెల మండలంలో 21 పనులకు కోటి 85 లక్షల రూపాయలు, కాల్వశ్రీరాంపూర్ మండలంలో 24 పనులకు కోటి 50 లక్షల రూపాయలు, ఎలిగేడు మండలంలో 16 పనులకు కోటి 20 లక్షల రూపాయల నిధులు మంజూరు చేశారు. అన్ని పనులు 5 లక్షల రూపాయలలోపు ఉన్నవే కావడంతో ఈ పనులను నామినేషన్ ప్రాతిపదికన అధికార పార్టీకి చెందిన నాయకులకు అప్పగించే అవకాశాలున్నాయి.

మేడారం జాతర వెళ్లే భక్తులకు ఏర్పాట్లు చేయాలి

- బస్ షెల్టర్ స్థలాన్ని పరిశీలించిన కలెక్టర్



జాతర బస్‌షెల్టర్ ఏర్పాటుకు ఐటీఐ ప్రాంగణాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మేడారం జాతరకు వెళ్లే భక్తులు ఇబ్బందులు పడకుండా బస్‌షెల్టర్ వద్ద అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశించారు. సోమవారం ఆయన ఐటీఐ ప్రాంగణంలో ఏర్పాటు చేసే మేడారం జాతర ప్రత్యేక బస్‌షెల్టర్ పాయింట్‌ను, ఐటీఐ తరగతులను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు మేడారం జాతర జరగనున్న నేపథ్యంలో బస్‌పాయింట్ వద్ద మహిళలకు, పురుషులకు వేర్వేరుగా ప్రత్యేకమైన టాయిలెట్లు ఏర్పాటు చేయాలన్నారు. ప్రాంగణంలో పారిశుధ్యం నిర్వహణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, అవసరమైన మేర డస్ట్ బిన్‌లు ఏర్పాటు చేయాలని, అవసరమైన పారిశుధ్య సిబ్బందిని కేటాయించాలని మున్సిపల్ కమిషనర్‌కు సూచించారు. అనంతరం విద్యార్థులతో మాట్లాడుతూ మార్కెట్ పరిస్థితుల డిమాండ్‌కు అనుగుణంగా ఎప్పటికప్పుడు నైపుణ్యాలను పెంచుకోవాలని సూచించారు. నైపుణ్యాలను ఎప్పటికప్పుడు అప్‌డేట్ చేసుకోవడం వల్ల మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంటుందని, అధిక ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. కలెక్టర్ వెంట మున్సిపల్ కమిషనర్ వేంకటేశ్, ఐటీఐ ప్రిన్సిపాల్, ఆర్టీసీ అధికారులు ఉన్నారు.

పలువురు అధికారులకు స్థాన చలనం

పెద్దపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలో మూడేళ్ల పదవీకాలం పూర్తిచేసుకున్న పంచాయతీరాజ్ శాఖకు చెందిన ముగ్గురు అధికారులను బదిలీ చేస్తూ రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ సందీప్‌కుమార్ సుల్తానియా సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. జడ్పీ సీఈవోగా పని చేస్తున్న ఎం శ్రీనివాస్‌ను కరీంనగర్ జడ్పీ సీఈవోగా బదిలీ చేశారు. ఆయన స్థానంలో మంచిర్యాల జిల్లా పరిషత్ సీఈవో కె నరేందర్‌ను పెద్దపల్లికి బదిలీ చేశారు. ఇక్కడ డీఆర్‌డీవోగా పనిచేస్తున్న వి శ్రీధర్‌ను కరీంనగర్‌కు బదిలీ చేయగా, ఆయన స్థానంలో ఆదిలాబాద్ డిప్యూటీ సీఈవో ఆర్ రాజేశ్వర్‌ను పెద్దపల్లికి బదిలీ చేశారు. జిల్లా పంచాయతీ అధికారిగా పని చేస్తున్న వి చంద్రమౌళిని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు బదిలీ చేశారు. ఆయన స్థానంలో జయశంకర్ భూపాలపల్లి జిల్లా డీపీవో లత పెద్దపల్లికి బదిలీపై వస్తున్నారు.

● ముగ్గురు తహసీల్దార్లకు పోస్టింగ్..

వివిధ జిల్లాల నుంచి జిల్లాకు బదిలీపై వచ్చిన ముగ్గురు తహసీల్దార్లకు పోస్టింగ్ ఇస్తూ సోమవారం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ ఉత్తర్వులు జారీ చేశారు. జగిత్యాల జిల్లా నుంచి వచ్చిన ఎండీ ఆరీఫ్ ఉద్దీన్‌కు కమాన్‌పూర్ తహసీల్దార్‌గా, కరీంనగర్ నుంచి వచ్చిన వి రమేష్‌ను మంథని డీఏవోగా, జయశంకర్ భూపాలపల్లి జిల్లా నుంచి వచ్చిన పి సుమన్‌కు మంథని ముత్తారం తహసీల్దార్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అలాగే కమాన్‌పూర్ తహసీల్దార్‌గా పనిచేస్తున్న వంగల మోహన్‌రెడ్డిని కలెక్టరేట్‌లో హెచ్ సెక్షన్ సూపరింటెండెంట్‌గా, ముత్తారం తహసీల్దార్ బి రాజేశ్వరిని ఈ సెక్షన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు.

రామగుండం పోలీస్ కమిషనర్‌గా శ్రీనివాసులు



శ్రీనివాసులు

కోల్‌సిటీ, ఫిబ్రవరి 12: రామగుండం నూతన పోలీస్ కమిషనర్‌గా ఎం శ్రీనివాసులును నియమించారు. ఈ మేరకు సోమవారం ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతకుమారి ఆదేశాలు జారీ చేశారు. 2006బ్యాచ్‌కు చెందిన ఐపీఎస్ అధికారి శ్రీనివాసులు డీజీ హోదాలో పోస్టింగ్ కోసం వెయిట్ చేస్తున్నారు. ఆయనకు రామగుండం పోలీస్ కమిషనర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. గతంలో రామగుండం కమిషనర్‌గా నియమింపబడిన ఎల్ఎస్ చౌహాన్‌లో జోగులాంబ డీఐజీగా యథాస్థానంలో కొనసాగాలంటూ ఆదేశాలు జారీ చేశారు. శ్రీనివాసులు గతంలో ఆదిలాబాద్ ఎస్పీగా కూడా పని చేశారు. సీఐడీలో కూడా పని చేశారు.

ఏసీపీలు, అదనపు డీఎస్పీల బదిలీ..

కోల్‌సిటీ, ఫిబ్రవరి 12: రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఏసీపీలు, అదనపు ఎస్పీలు బదిలీ అయ్యారు. పెద్దపల్లి ఏసీపీ మహేష్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో సీహెచ్ శ్రీనివాస్‌కు పోస్టింగ్ ఇచ్చారు. శ్రీనివాస్ సీఐడీలో డీఎస్పీగా పనిచేస్తున్నారు. ఈయనతో పాటు కరీంనగర్ పీటీసీ డీఎస్పీగా పనిచేస్తున్న జి మహేష్ బాబును రామగుండం సీసీఎస్ ఏసీపీగా బదిలీ చేశారు. కరీంనగర్ సీసీఎస్ ఏసీపీగా పనిచేస్తున్న మాధవిని రామగుండం సీసీఆర్బీ ఏసీపీగా నియమించారు. వీరితోపాటు ఖాళీగా ఉన్న అదనపు డీసీపీ ఆపరేషన్‌గా వి శ్యాంబాబుకు పోస్టింగ్ ఇచ్చారు. శ్యాంబాబు ప్రస్తుతం ట్రాన్స్‌కోలో ఉన్నారు.

కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం సైనికుల్లా పనిచేయాలి

- బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి



బీజేపీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న సునీల్‌రెడ్డి

గోదావరిఖని, ఫిబ్రవరి 12: దేశంలో బీజేపీని అధికారంలోకి తీసుకురావడానికి ప్రతి కార్యకర్త సైనికుల్లా పని చేయాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్ రెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం గోదావరిఖనిలోని ఒక ప్రైవేట్ హోటల్‌లో బీజేపీ నాయకుడు అయోధ్య రవీందర్ ఆధ్వర్యంలో 200మంది బీజేపీలో చేరగా వారికి పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీని గెలిపించాలని, రాష్ట్రంలో బీఆర్ఎస్ పూర్తిగా తుడిచిపెట్టుకుపోయిందని, బీఆర్ఎస్‌కు ఓటు వేస్తే వృథా అని అన్నారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చే అవకాశం ఉందని, ఆ పార్టీలో నాయకులు కొట్టుకోవడానికే సరిపోతుందన్నారు. పెద్దపల్లి పార్లమెంట్‌లో కాషాయజెండా ఎగురవేసి నరేంద్రమోదీకి బహుమతిగా ఇవ్వాలన్నారు. పైతరి రాజు తన అనుచరులతో కలిసి బీజేపీలో చేరారు. ఈ కార్యక్రమంలో అయోధ్య రవీందర్, కందుల సంధ్యారాణి, బల్మూరి వనిత, అమరేందర్‌రావు, తోట కుమారస్వామి, ముష్కె సంపత్‌యాదవ్, అడిగొప్పుల రాజు, ధర్మాజీ, వినయ్, మహేందర్, సురేష్, నవీన్, నాగరాజు, కిరణ్, విశ్వాస్, పవన్, గట్టయ్య, రాజేష్‌నాయక్ పాల్గొన్నారు.

ఖని జనరల్ ఆసుపత్రిలో వైద్యుల నిరసన



ఆసుపత్రి ఎదుట నిరసన తెలుపుతున్న వైద్యులు

కళ్యాణ్‌నగర్, ఫిబ్రవరి 12: కామారెడ్డి జనరల్ ఆసుపత్రి ఐసీయూలో ఉన్న రోగిని ఎలుకలు కరిచిన సంఘటనలో డాక్టర్లను బాధ్యులను చేసి సస్పెండ్ చేయడం సరైంది కాదంటూ సోమవారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఎదుట డాక్టర్లు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అసిస్టెంట్ ప్రొఫెసర్ రాజు మాట్లాడుతూ ఆసుపత్రిలో శానిటేషన్ చూసుకోవాల్సిన బాధ్యత అక్కడున్న శానిటేషన్ సిబ్బందిపై ఉంటుందని, ఎలుకలు రావడానికి డాక్టర్లు ఎలా బాధ్యులవుతారని ప్రశ్నించారు. ప్రతిదానికి వైద్యులను బాధ్యులను చేస్తూ సస్పెండ్ చేయడం సరికాదని, ఆసుపత్రిలో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ చూసుకోవాల్సిన బాధ్యత డీఎంఈదన్నారు. సస్పెండ్ చేసిన డాక్టర్‌ను విధుల్లోకి తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ నిరసనలో ప్రొఫెసర్లు ఫరీద్, శిరీష, గోపి, స్వామి, రవివర్మ పాల్గొన్నారు.

మాజీ సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కమాన్‌పూర్, ఫిబ్రవరి 12 : మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం మండల కేంద్రంలో దహనం చేశారు. ఎన్నికల్లో ఓడిపోవడంతో ప్రజల్లో తమ పార్టీని ఉనికి చాటుకునేందుకు మాజీ సీఎం కేసీఆర్ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పదేళ్ల అధికారంలో బీఆర్ఎస్ పార్టీ ఉన్న సమయంలో నీళ్ల ప్రాజెక్టులను అప్పజెప్పి ఇప్పుడు అధికారం పోయాక కాంగ్రెస్ ప్రభుత్వంపై బురదచల్లే ప్రయత్నం బీఆర్ఎస్ నాయకులు చేస్తున్నారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కిసాన్ కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు మూసుకుల సురేందర్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు వైనాల రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి గాండ్ల మోహన్, ఆడెపు రమేష్, సాగి శ్రీధర్‌రావు, లింగాల కుమార్, శివశంకర్, బండారి ప్రసాద్, చొప్పరి శేఖర్, బాధ్రపు శంకర్, కుక్క రవి, కిసాన్ కాంగ్రెస్ కార్యదర్శి జంగి కుమార్, నాయకులు తదితరులు ఉన్నారు.

కేంద్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కలిగి ఉండాలి

- కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి మనోజ్ సేఠీ



క్విజ్ పోటీల విజేతకు బహుమతి అందజేస్తున్న మనోజ్ సేఠీ

పెద్దపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలన కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల పట్ల ప్రతిఒక్కరు అవగాహన కలిగి ఉండాలని, అర్హులైన వారందరూ వాటిని వినియోగించుకోవాలని కేంద్ర రసాయన, ఎరువుల శాఖ సంయుక్త కార్యదర్శి, ప్రభుత్వ ఆర్థిక సలహాదారు మనోజ్ సేఠీ అన్నారు. సోమవారం పెద్దపల్లిలోని భూంనగర్‌లో నిర్వహించిన వికసిత్ భారత్ యాత్రలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ దేశంలోని పేదరికం తొలగించేందుకు కేంద్ర ప్రభుత్వం నరేంద్ర మోదీ నేతృత్వంలో వివిధ కార్యక్రమాలను చేపట్టి విజయవంతంగా అమలు చేస్తోందన్నారు. ప్రపంచవ్యాప్తంగా భారత దేశం సాధిస్తున్న పురోగతి గురించి చర్చించుకుంటున్నారని, ప్రజల వద్దకు పాలన అందిస్తూ అర్హులైన వారికి కేంద్ర ప్రభుత్వ పథకాలను అందించేందుకు వికసిత్ భారత్ సంకల్ప యాత్రను చేపట్టామని తెలిపారు. తపాలా శాఖ ద్వారా సుకన్య యోజన, మహిళా సమ్మాన్ ఖాతా అనే పథకాలకు అధిక వడ్డీ అందిస్తున్నామని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ కింద 5లక్షల వరకు ఉచితంగా చికిత్స అందిస్తున్నామని, ఉజ్వల్ యోజన కింద గ్యాస్ కనెక్షన్ లేని పేద మహిళలకు ఉచితంగా గ్యాస్ కనెక్షన్ అందిస్తున్నామని, సిలిండర్‌పై సైతం 300సబ్సిడీ అందిస్తున్నామని తెలిపారు. పీఎంఎస్‌బీవై పథకం కింద 2లక్షల ప్రమాద బీమా, పీఎంజెజేబీవై పథకం కింద 2 లక్షల సాధారణ బీమా అందిస్తున్నామని తెలిపారు. ఆధార్‌సెంటర్ ద్వారా ప్రతి ఒక్కరూ తమ వివరాలను అప్ డేట్ చేసుకోవాలని ఆయన సూచించారు. బ్యాంక్ ద్వారా దేశ ప్రజలందరికి ఆర్థిక అక్షరాస్యత అందించేందుకు అవగాహన క్యాంపులు ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. వ్యాపార నిమిత్తం సెక్యూరిటీ లేకుండా లక్ష నుంచి 3 లక్షల వరకు ముద్రా రుణాలు అందిస్తున్నామని తెలిపారు. పీఎం స్వానిధి పథకం కింద వీధి వ్యాపారులకు రుణాలు అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా వికసిత భారత ప్రతిజ్ఞ చేసిన అనంతరం తపాలా శాఖ, ఉజ్వల్, ఆయూష్మాన్ భారత్, బ్యాంక్, ఆర్థిక అక్షరాస్యత, మొదలగు కేంద్ర ప్రభుత్వ పథకాలపై క్విజ్ నిర్వహించి సరైన సమాధానాలు చెప్పిన వారికి టీషర్ట్ క్యాపులను అందజేసి, కార్యక్రమంలో పాల్గొన్న వారికి క్యాలెండర్లను పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో పెద్దపల్లి ఆర్‌డీవో సీహెచ్ మధు మోహన్, పెద్దపల్లి మున్సిపల్ కమిషనర్ వెంకటేష్, ఎల్‌డీఎం వెంకటేష్, వార్డ్ కౌన్సిలర్, సంబంధిత అధికారులు, మెప్మా పీడీ అర్బన్ రజినీ, ఎంఎల్ హెచ్‌పీ నవ్య, మెప్మా సిబ్బంది, మహిళలు, ఆశా వర్కర్లు, ఆర్‌పీలు మెడికల్, మున్సిపల్, పోస్టాఫిస్, గ్యాస్ ఏజెన్సీ సభ్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించేలా టాస్క్ సెంటర్ : కలెక్టర్



టాస్క్ సీఈవోతో కలిసి భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్

పెద్దపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): యువతలో నైపుణ్యం పెంపొందించడానికి టాస్క్‌సెంటర్ ఏర్పాటు దిశగా ప్రత్యేక కార్యాచరణ అమలుచేస్తున్నామని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. సోమవారం టాస్క్ సీఈవో శ్రీకాంత్ సిన్హాతో కలిసి కలెక్టర్ ఐటీఐలోని పాత కలెక్టరేట్ కార్యాలయం, ఎంపీడీవో ప్రాంగణంలో పాత ప్రభుత్వ కార్యాలయాలు, పెద్దపల్లి డివిజనల్ పంచాయతీ అధికారి కార్యాలయాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ పరిశ్రమలకు నాణ్యమైన మానవ వనరులు, సేవలందించే లక్ష్యంతో ప్రభుత్వం, పరిశ్రమ, విద్యాసంస్థల మధ్య సమన్వయం తీసుకురావడానికి టాస్క్ సెంటర్ దోహదపడుతుందని తెలిపారు. యువతకు నైపుణ్య అభివృద్ధికి శిక్షణ అందించేందుకు టాస్క్ సెంటర్ జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి.శ్రీధర్ బాబు ప్రకటించారని, దాని ప్రకారం ఐటి, ఇతర రంగాల్లో ఉపాధి నైపుణ్య శిక్షణకు నిపుణులు జిల్లాకు వచ్చి టాస్క్‌సెంటర్ ఏర్పాటుకు అనువైన ప్రభుత్వ భవనాలను పరిశీలించారని కలెక్టర్ తెలిపారు. ఈ పర్యటనలో కలెక్టర్ వెంట టాస్క్ మేనేజర్లు ప్రదీప్‌రెడ్డి, ఉమ్మడి కరీంనగర్ జిల్లా మేనేజర్ గంగాప్రసాద్, మున్సిపల్ కమిషనర్ వేంకటేశ్, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

● బస్టాప్ వద్ద విద్యార్థులతో ముచ్చటించిన కలెక్టర్..

కలెక్టరేట్ ఎదుట జిల్లా చరిత్ర ప్రతిబింబించేలా ఏర్పాటు చేసిన బస్‌షెల్టర్‌లో ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు వేచి ఉండడాన్ని గమనించిన కలెక్టర్ బస్టాప్‌లో కూర్చుని కాసేపు చిట్ చాట్ చేశారు.

భూ ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలి

తమ భూమిలో వేసుకున్న పంటను చెడగొట్టి భూమిని ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని బాధితులు కలెక్టర్‌ను కోరారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ జే.అరుణశ్రీతో కలిసి ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరించారు. ధర్మారం మండలం బొమ్మరెడ్డిపల్లి గ్రామానికి చెందిన గౌరీ భూదేవి కుటుంబం సర్వే నెంబర్ 679/1లోగల తమ భూమిలో పంటను చెడగొట్టి ఆక్రమించి ఇతర పంట వేసుకున్నారని, మాకు నష్టపరి హారం ఇప్పించి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరగా, పెద్దపల్లి ఏసీపీకి చర్యలు తీసుకోవాలని రాశారు. రామగుండం 18వ వార్డుకు చెందిన ఇ మమత తనకు సదరం సర్టిఫికెట్ 77 శాతం వైకల్యంతో ఉందని, తనకు వస్తున్న వితంతు పెన్షన్ మార్పు చేసి దివ్యాంగుల పెన్షన్ ఇప్పించాలని కలెక్టర్‌ను కోరారు. రామగుండం చైతన్యపురి కాలనీకి చెందిన ఎ శ్వేత తనకు ఔట్‌సోర్సింగ్ స్వీపర్‌గా ఉపాధి కల్పించాలని కోరగా రామగుండం మున్సిపల్ కమిషనర్‌కు రాస్తూ చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అనంతరం ఆయన జిల్లా అధికారులతో వివిధ అంశాలపై సమావేశం నిర్వహించారు.

యాజమాన్యాలు వేధిస్తే 100కి డయల్ చేయండి : సీఐ




వలస కార్మికులతో మాట్లాడుతున్న పెద్దపల్లి సీఐ కృష్ణ

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 12 : బతుకుదెరువు కోసం వచ్చే వలస కార్మికులపై యాజమాన్యాలు వేధింపులకు గురిచేస్తే డయల్ 100కి కాల్ చేయాలని పెద్దపల్లి సీఐ కృష్ణ అన్నారు. పెద్దపల్లి మం డలంలోని గౌరెడ్డిపేటలోగల ఎంఎస్ఆర్ ఇటుక బట్టీలో విషాహారం వల్ల 35మంది అస్వస్థకు గురికాగా ఇద్దరు మృతిచెందారు. సోమవా రం పెద్దపల్లి సీఐ కృష్ణ ఇటుక బట్టీలో వలస కార్మికులతో పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీఐ కృష్ణ మాట్లాడుతూ బట్టీలో పనిచేసే కార్మికులకు విషాహారం తినడం వల్ల ఇప్పటికీ కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో 16 మంది చికిత్స పొందుతున్నారని, ఒకరి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్ యశోద ఆసుపత్రికి తరలించామన్నారు. మరి కొందరు కరీంనగర్‌తో పాటు పెద్దపల్లి ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నారన్నారు. ఇటుక బట్టీల యాజమాన్యాలు సైతం కార్మికుల పట్ల నిర్లక్ష్యం చేయరాదని, నిర్లక్ష్య వైఖరి కొనసాగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఇటుక బట్టీలో ఇంకా ఎవరికైనా ఆరోగ్య పరిస్థితులు బాగా లేకపోతే తప్పకుండా ఆసుపత్రులకు తరలించాలని వారికి సూచించారు. ఆయన వెంట డీఎల్‌పీవో వేణుగోపాల్, ఎంపీవో సుదర్శన్, సీడీపీవో కవిత, రాఘవపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు మమత, కార్మిక శాఖ అధికారి రామ్మోహన్‌తో పాటు పలువురు పాల్గొన్నారు.

కాగా, గౌరెడ్డిపేట ఇటుక బట్టీలో అధికారులు విచారణ చేస్తుండగానే మరోక బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో స్పందించిన ఇటుక బట్టీల యజమానులు తమ వాహనంలో పెద్దపల్లి ఆసుపత్రికి తరలించారు.









ఇంజనీరింగ్ విద్యార్థులు వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

కొడిమ్యాల, ఫిబ్రవరి 12 : ఇంజనీరింగ్ విద్యార్థులు వారం రోజులు నిర్వహించే వర్క్‌షాప్‌ను సద్వినియోగం చేసుకోవాలని మెకానికల్ విభాగాధిపతి, కన్వీనర్ డా.. కె. వసంత్‌కుమార్ అన్నారు. సోమవారం మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో వారం రోజుల పాటు నిర్వహించే 'ఫైనైట్ ఎలిమెంట్ అనాలసెస్ యూజింగ్ అన్సిస్ వర్క్ బెంచ్' ప్రారంభం చేశారు. ఈ సందర్భంగా కన్వీనర్ మాట్లాడుతూ ఈ సాఫ్ట్‌వేర్‌ను ఉపయోగించుకొని ఏదైనా రియల్ ప్రొడక్ట్‌ను తయారు చేయకుండానే దాని మోడల్‌ను ప్రిపేర్ చేసుకోవచ్చునన్నారు. చేసిన మోడల్ ఎంత వరకు పనిచేస్తుందో తెలుసుకోవచ్చునన్నారు. అసలు ప్రొడక్ట్ తయారు చేయకుండానే ఖర్చును తగ్గించుకొని ఖచ్చిత్వాన్ని తెలుసుకోవచ్చన్నారు. ఈ సాఫ్ట్‌వేర్ తెలుసుకోవటంతో ప్రొడక్ట్ ఎలా పనిచేస్తుంది, ఏ మెటీరియల్ వాడాలన్న విషయాలు తెలుస్తాయన్నారు. ఈ వర్క్‌షాప్‌కు సహకరించిన రిసోర్స్ పర్సన్ రాజ మహేంద్ర సిమ్యులేషన్ ఇంజనీర్ హైదరాబాదు, మెకానికల్ ఫ్యాకల్టీ కోకన్వీనర్ డా.. సురేష్ అర్జుల్లా, కోఆర్డినేటర్ బి. నర్సయ్యకు విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ వర్క్ షాప్‌లో వైస్ ప్రిన్సిపాల్ డా.. టి.వేణుగోపాల్, వివిధ విభాగాల అధిపతులు, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.


వర్క్‌షాప్‌లో మాట్లాడుతున్న కన్వీనర్ వసంత్‌కుమార్

రెండు ద్విచక్ర వాహనాలు ఢీ : ఇద్దరికి గాయాలు

బోయినపల్లి, ఫిబ్రవరి12: రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన బోయినపల్లి మండలం దేశాయిపల్లి సమీపాన సోమవారం జరిగింది. ఈ ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. గాయపడ్డ వారి వివరాలు తెలియాల్సి ఉంది.









డీఈఈ సెట్ ప్రవేశాలకు ధ్రువపత్రాల పరిశీలన

తిమ్మాపూర్, ఫిబ్రవరి12: డీఈఈ సెట్-2023లో ఉత్తీర్ణులై ఇప్పటి వరకు ఒరిజినల్ ధ్రువ పత్రాల పరిశీలన చేయించుకోని ఉమ్మడి కరీంనగర్ జిల్లా అభ్యర్థులు మూడవ దశలో ప్రవేశాల కోసం ఈ నెల 14న ఉదయం 10గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు మండలంలోని ఎల్ఎండి కాలనీలో గల ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో తమ సర్టిఫికెట్‌ల పరిశీలన చేయించుకోవచ్చని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ జిల్లా విద్యా శిక్షణ సంస్థ(డైట్)లో రెండు సంవత్సరాల కోర్సు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఈఎల్ఈడి), డిప్లొమా ఇన్ ప్రీస్కూల్ ఎడ్యుకేషన్(డిపిఎస్ఈ) మొదటి సంవత్సరం 2023-24లో చేరుటకు నిర్వహించిన డీఈఈ సెట్-2023లో ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో డైట్‌కు రావాలని కోరారు. మూడవ దశ ప్రవేశాలకు ఈ నెల 15 నుంచి 17 వరకు ఆప్షన్ పెట్టుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు డీఈఈ సెట్ వెబ్‌సైట్‌ను సందర్శించాలని డైట్ ప్రిన్సిపాల్ శ్రీరాం మొండయ్య తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మహిళకు గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని రాజాపల్లి గ్రామ శివారులో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. హన్మకొండకు చెందిన ఆర్ కల్పన అనే మహిళ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తుండగా, విధుల్లో భాగంగా జమ్మికుంటకు వచ్చి తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై వెళ్తుంది. ఈ క్రమంలోనే రాజపల్లి గ్రామ శివారులోకి ద్విచక్ర వాహనం చేరుకోగానే, వాహనం అదుపు తప్పి పక్కనే బోర్డుకు ఢీకొట్టింది. ఈ ఘటనలో సదరు మహిళలకు గాయాలయ్యాయి. గమనించిన స్థానికులు వెంటనే 108కు సమాచారం అందించారు. మెరుగైన చికిత్స నిమిత్తం హుజూరాబాద్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

బ్యాంకులో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: కరీంనగర్ కలెక్టరేట్ ఎదుట ఉన్న యూనియన్ బ్యాంక్‌లో సోమవారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం జరిగి పలు ఫైళ్లు కాలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా యూబీఐ స్టోర్‌రూంలో మంటలు అంటుకుని ప్రమాదం జరిగిందని ఫైర్ ఆఫీసర్ పరమేశ్వర్ తెలిపారు. సమాచారం అందిన వెంటనే ఫైర్ ఇంజన్‌తో సహా ఘటనా స్థలానికి వెళ్లి మంటలను ఆర్పివేశామని ఆయన తెలిపారు.

శివంగాలపల్లిలో మూడు ఇళ్లలో చోరీ

కోనరావుపేట, ఫిబ్రవరి 12 : తాళం వేసి ఉన్న ఇళ్లను టార్గెట్ చేస్తూ కోనరావుపేట మండలంలో వరుస దొంగతనాలకు పాల్పడుతున్నారు. గత వారం రోజుల్లో నాలుగు గ్రామాల్లో దొంగలు చోరీకి పాల్పడ్డారు. కోనరావుపేట మండలం శివంగాలపల్లి గ్రామంలో సోమవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు తాళం వేసి ఉన్న ఇళ్లలో చోరీకి పాల్పడ్డారు. బొడ్డు దేవయ్య, జంగం లక్ష్మి, గూడూరు రేణుక వీరు ఇళ్లకు తాళం వేసి తమ బంధువుల ఇంటికి వెళ్లారు. ఇదే అదునుగా భావించిన దొంగలు బొడ్డు దేవయ్య ఇంటిలో తాళం పగలగొట్టి 30 తులాల వెండి ,జంగం లక్ష్మి ఇంటిలో తాళం పగలగొట్టి 20 తులాల వెండి, గూడూరి రేణుక ఇంటి తాళం పగలగొట్టి మూడు వేల నగదును అపహరించారు. ఈ విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు దొంగతనం తీరును పరిశీలించి సీసీ కెమెరాల ఫుటేజ్ తీయగా ఇద్దరు వ్యక్తులు మంకీ క్యాప్ ధరించి దొంగతనానికి పాల్పడుతున్నట్లు గుర్తించారు. ఎస్సై ఆంజనేయులు కేసు నమోదు చేసుకుని డాగ్ స్క్వాడ్‌తో గాలింపు చేపట్టారు.

కుక్కల దాడిలో ఆరుగురికి తీవ్ర గాయాలు

హుజూరాబాద్‌రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని పెద్దపాపయ్యపల్లి గ్రామంలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తూ ప్రజలను భయందోళనకు గురిచేస్తున్నాయి. గత రెండు రోజులుగా కుక్కలు దాడులకు ప్పాలడుతున్నాయి. సోమవారం వరకు ఆరుగురు కుక్కల దాడిలో గాయాలపాలయ్యారు. వృద్ధులు, పిల్లలు, మహిళలు బయటికి రావడానికి భయపడుతున్నారు. అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

రూ.6,700 పలికిన పత్తి ధర

జమ్మికుంట, ఫిబ్రవరి 12: జమ్మికుంట వ్యవసాయ మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర రూ.6,700 పలికింది. సోమవారం మార్కెట్ యార్డుకు 114మంది రైతులు 1,134క్వింటాళ్ల విడి పత్తి, ఎనిమిది మంది రైతులు 14క్వింటాళ్ల గోనె సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం ద్వారా గరిష్ఠ ధర రూ.6,700, కనిష్ఠ ధర రూ.5,800 చెల్లించి పత్తి కొనుగోళ్లు చేపట్టారు.

ఆర్థిక ఇబ్బందులతో ఒకరి ఆత్మహత్య

వీణవంక ఫిబ్రవరి 12: మండలంలోని బొంతుపల్లి గ్రామానికి చెందిన ముష్క సదయ్య (45)ఆర్థిక ఇబ్బందులతో తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కొంత కాలంగా ఆర్థిక ఇబ్బందులతో పాటు తన కూతురు పెళ్లి గురించి ఆలోచిస్తూ మనస్థాపానికి గురై ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.


నందిమేడారంలో సైబర్ మోసం

ధర్మారం,ఫిబ్రవరి12: ధర్మారం మండలం నందిమేడారం గ్రామానికి చెందిన నందినేని పవన్‌కుమార్ ఎస్‌బీఐ ఖాతా నుంచి రూ. 10వేలు అతనికి తెలియకుండా వేలిముద్రతో సైబర్ నేరగాళ్లు డ్రా చేశారు. ఈ మేరకు సోమవారం బాధితుడు పవన్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. తన ఎస్‌బీఐ ఖాతా నుంచి ఆదివారం సాయంత్రం ఏఈపీఎస్ ద్వారా పది వేల రూపాయల నగదును విత్‌డ్రా చేశారు. డ్రా చేసినట్టు తన సెల్ నంబరుకు మెసేజ్ వచ్చింది. ఆందోళనకు గురైన పవన్‌కుమార్ వెంటనే 1930 ఫిర్యాదు చేశాడు. ఈ నెల 9న ధర్మారం తహసీల్దార్ కార్యాలయంలో భూమి రిజిస్ట్రేషన్ కోసం తన వేలిముద్రలను ఉపయోగించాడు. అక్కడి నుంచి ఎవరో తన వేలిముద్రలను ఉపయోగించి మోసం చేశారని ఆయన అనుమానంతో సోమవారం బాధితుడు పవన్‌కుమార్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసినట్టు ఎస్సై సత్యనారాయణ తెలిపారు. సైబర్ నేరగాళ్ల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఆధార్ కార్డులను బయోమెట్రిక్ లాక్ చేసుకోవాలని ఆయన సూచించారు.

కుటుంబ కలహాలతో యువకుడి ఆత్మహత్య

ఎలిగేడు, ఫిబ్రవరి 12: మండలంలోని శివపల్లి గ్రామానికి చెందిన దొమ్మటి సాగర్(28)సోమవారం గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకున్నట్లు జూలపల్లి ఎస్సై ఎన్.శ్రీధర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. గత కొన్ని రోజులుగా కుటుంబంలో కలతలు వచ్చాయని దీంతో జీవితంపై విరక్తి చెంది గడ్డి మందు తాగగా కుటుంబ సభ్యులు గమనించి కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స చేస్తుండగా మృతి చెందాడని తెలిపారు. సాగర్‌కు భార్య కల్యాణి, కూతురు 18నెలల పాప ఉందని తెలిపారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. సాగర్ నేత్రాలను లయన్స్ క్లబ్‌వారు సేకరించారు.

ఎన్‌సీసీ శిక్షణ శిబిరానికి ఎంపిక


జ్యోత్స్న

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 12: నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఈ నెల 12వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ఆంధ్రప్రదేశ్‌లోని కృష్ణా జిల్లాలో నిర్వహించే శిక్షణ శిబిరానికి గోదావరిఖని సెక్రెడ్ హార్ట్ హైస్కూల్‌కు చెందిన ఎన్‌సీసీ ఫస్ట్ ఆఫీసర్, శిక్షకురాలు జ్యోత్స్న ఎంపికయ్యారు. 9వ బెటాలియన్ తరుపున జ్యోత్స్న పాల్గొంటున్నారు. ఈ మేరకు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు, కరస్పాండెంట్, ఉపాధ్యాయ బృందం అభినందనలు తెలిపారు.

ఇద్దరు దొంగల అరెస్ట్

సిరిసిల్ల క్రైం , ఫిబ్రవరి 11 సిరిసిల్ల పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన మల్లేశం ఇంట్లో సెల్ ఫోన్, రూ. 500 నగదు ఎత్తుకెళ్లిన ఇద్దరు దొంగలను సోమవారం అరెస్ట్ చేశామని టౌన్ సిఐ రఘుపతి తెలిపారు. పెయింటింగ్ చేస్తూన్నా శ్రీకాంత్, సంతోష్‌లు చోరీకి పాల్పడినట్లు అయన తెలిపారు.

మల్లికార్జున్‌రెడ్డికి మిలియనీర్ ఫార్మర్ అవార్డు

చొప్పదండి, ఫిబ్రవరి 12: చొప్పదండి మండలంలోని పెద్దకుర్మపల్లికి చెందిన ఉత్తమ రైతు మవురం మల్లికార్జునరెడ్డి డిస్ట్రిక్ట్ మిలియనీర్ ఫార్మర్ ఆఫ్ ఇండియా అవార్డు అందుకున్నారు. సూర్యాపేట జిల్లా గడ్డిపల్లి కెవికెలో జరిగిన రైతు సదస్సులో మల్లికార్జున్‌రెడ్డి అవార్డును ఐసిఎఆర్ డిడిజి డాక్టర్ ఉత్తంసింగ్ గౌతం ఏటిఎఆర్ఐ డైరెక్టర్‌లు అందజేశారు. తనకు అవార్డు రావడానికి కృషి చేసిన జమ్మికుంట కెవికె డైరెక్టర్ వెంకటేశ్వరరావుకు ఈ సందర్భంగా మల్లిఖార్జునరెడ్డి ధన్యవాదాలు తెలిపారు.

వేములవాడకు పోటెత్తిన భక్తులు


భక్తులతో కిక్కిరిసిపోయిన ఆలయ పరిసరాలు


క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

వేములవాడ, ఫిబ్రవరి 12 : దక్షిణ కాశీ, ప్రముఖ పుణ్యక్షేత్రం వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి దేవస్థానం సోమవారం నాడు అశేష భక్తజనంతో జాతరను తలపించింది. మేడారం సమ్మక్క సారలమ్మ జాతరకు వెళ్లడానికి ముందు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకునేందుకు ప్రతినిత్యం వేలాది మంది భక్తులు తరలివస్తుండడంతో వేములవాడ పుణ్యక్షేత్రంలో గత కొద్ది రోజులుగా జాతరను పోలిన వాతావరణం నెలకొంది. ఈ క్రమంలో సోమవారం నాడు సుమారు 60 వేలకు పైగా భక్తులు రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకుని మొక్కులు చెల్లించినట్లు అంచనా. ఆదివారం తెల్లవారుజాము నుండి నిరంతరాయంగా కొనసాగిన స్వామివారి దర్శనం సోమవారం రాత్రి వరకు సాగింది. ఫలితంగా ఆదివారం ఉదయం నుంచి సోమవారం రాత్రి వరకు సుమారు 90 వేల మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నట్లు అంచనా. ఈ సందర్భంగా వారు ఆలయ కళ్యాణ కట్టలో తలనీలాలు సమర్పించి ధర్మగుండంలో పవిత్ర స్నానాలు ఆచరించారు. అనంతరం సర్వదర్శనం, శీఘ్ర దర్శనం క్యూలైన్ల మీదుగా ఆలయంలోకి చేరుకొని రాజరాజేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు. భక్తుల రద్దీ అధికంగా ఉన్న కారణంగా గర్భాలయ ప్రవేశం నిలిపివేసి స్వామివారి దర్శనం త్వరితగతిన సాగే విధంగా ఆలయ అధికారులు చర్యలు తీసుకున్నారు. దీంతో భక్తులు నందీశ్వరుడి వద్ద నుంచి స్వామివారిని దర్శించుకున్నారు. గర్భాలయంలో అభిషేకం, అన్నపూజ నిలిపివేయడంతో క్యూలైన్లు వేగంగా కదిలాయి. స్వామివారికి ప్రీతిపాత్రమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వచ్చింది. కోడె మొక్కు క్యూలైన్ పార్కింగ్ స్థలం వరకు సాగడంతో మొక్కు చెల్లింపుకు సుమారు నాలుగు నుండి ఐదు గంటల పైగా సమయం అవసరమైంది. ఆదివారం ఉదయం నుండి ప్రారంభమైన కోడె మొక్కు చెల్లింపు సోమవారం రాత్రి వరకు నిరంతరాయంగా సాగింది. వేలాదిగా తరలివచ్చిన భక్తులతో రాజన్న ఆలయ ప్రాంగణం తో పాటు ప్రధాన వీధులు, జాత్రా గ్రౌండ్ ప్రాంతం కిటకిటలాడింది. భక్తుల వాహనాలతో గుడి చెరువు పార్కింగ్ ప్రదేశం పూర్తిగా నిండిపోయింది. బద్ది పోచమ్మ ఆలయంలో భక్తుల రద్దీ కొనసాగింది. వేలాది మంది భక్తులు తలపై బోనం పెట్టుకొని క్యూ లైన్లలో గంటల కొద్దీ నిరీక్షించి తమ వంతు రాగానే ఆలయంలో చేరుకుని బద్ది పోచమ్మ అమ్మవారి కి బోనం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. అనుబంధ ఆలయమైన శ్రీ భీమేశ్వరాలయంలోనూ భక్తుల రద్దీ కొనసాగింది. ఈ సందర్భంగా భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కృష్ణ ప్రసాద్ నేతృత్వంలో అధికారులు తగిన ఏర్పాట్లు చేశారు.

రైల్వే లైన్ బాధితులకు పరిహారం చెల్లించాలి

వేములవాడ, ఫిబ్రవరి 12: వేములవాడ రైల్వే లేన్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న బాధితులు సోమవారం సాయంత్రం ప్రజాహిత యాత్ర చేస్తున్న బండి సంజయ్‌ను కలిశారు. స్థానిక తెలంగాణ చౌక్ వద్దకు చేరుకున్న బండి సంజయ్‌ను కలిసిన బాధితులు తమకు తగిన పరిహారం చెల్లించాలని, లేదంటే తమ భూములను గెజిట్ నుంచైనా తొలగించాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయమై ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకువచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ఉన్న ఎమ్మెల్యేను ఈ అంశంపై పలుమార్లు కలిసినా పట్టించుకోలేదని వాపోయారు. దీనిపై స్పందించిన బండి సంజయ్ సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళతానని హామీ ఇచ్చారు.

విద్యుత్ తీగలు అమర్చి చేపలు పట్టిన వ్యక్తుల రిమాండ్

ఎల్లారెడ్డిపేట, ఫిబ్రవరి 12: విద్యుత్తు తీగలు అమర్చి చేపలను వేటాడుతున్న సంఘటనలో ఎల్లారెడ్డిపేట మండలం పదిర గ్రామానికి చెందిన దొంతరవేణి విజయ్, కుర్ర భాస్కర్‌లపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పర్చగా ప్రథమ శ్రేణి కోర్టు న్యాయమూర్తి ప్రవీణ్ రిమాండ్ విధించగా కరీంనగర్ జైలుకు తరలించామని ఎస్ఐ రమాకాంత్ సోమవారం తెలిపారు. మండలంలోని నారాయణపూర్ గ్రామ శివారులో గల చెక్ డ్యాంలో తాము చేపలు పెంచుతున్న క్రమంలో పదిర వాసులు విజయ్, భాస్కర్‌లు కరెంటు షాక్‌తో చేపలను వేటాడుతున్నారని ఎలవేణి శ్రీనివాస్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. ఎవరైనా విద్యుత్తు తీగలను అమర్చి జంతువులు, చేపలు వేటాడడంతో పాటు పంట పొలాల చుట్టు కరెంటు తీగలను ఏర్పాటు చేసినట్లు తమ దృష్టికి వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

15న జేఎల్ఎం అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన

గణేశ్‌నగర్,ఫిబ్రవరి 12: టీఎస్ఎన్‌పీడీసీఎల్ జిల్లా సర్కిల్ కార్యాలయంలో ఈ నెల 15న జూనియర్ లైన్‌మెన్(జేఎల్ఎం) అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన, స్తంభం ఎక్కించే పరీక్షలను నిర్వహిస్తున్నట్లు ఎస్ఈ గంగాధర్ తెలిపారు. ఈ పరీక్ష ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. జేఎల్ఎం అభ్యర్థులకు వారి చిరునామాలకు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా కాల్‌లెటర్లు పంపించామన్నారు. కాల్‌లెటర్ అందనివారు కరీంనగర్ సర్కిల్ కార్యాలయంలో వాటిని పొందవచ్చన్నారు. జేఎల్ఎం నియామక కమిటీ ద్వారా అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన, పోలు ఎక్కించే పరీక్షలను పారదర్శకంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు.

యువకుడి ఆత్మహత్య

కొడిమ్యాల, ఫిబ్రవరి 12: మండలంలోని నమిళికొండ గ్రామంలో రామడుగు మండల కేంద్రానికి చెందిన బత్తిని మదన్(37)శనివారం రాత్రి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ అర్జరాజు తెలిపారు. హెడ్‌కానిస్టేబుల్ తెలిపిన వివరాల మేరకు.. మదన్ రెండు సంవత్సరాల నుంచి అత్తగారి ఊరు మండలంలోని నమిళికొండ గ్రామంలో నివసిస్తూ ఆటో నడుపుకుంటూ జీవనోపాధి పొందుతున్నాడన్నారు. ఆర్థిక ఇబ్బందులతో పాటు మద్యానికి బానిసై ఇంటిలో ఎవరూ లేని సమయంలో దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడినట్లు మృతుని భార్య మౌనిక ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు. మృతునికి భార్య, ఇద్దరు కూతుళ్ల ఉన్నట్లు తెలిపారు.

కాళేశ్వరంపై కాంగ్రెస్, బీఆర్ఎస్ దాగుడు మూతలు

- లక్ష కోట్ల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిన కేసీఆర్ ప్రభుత్వం
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్

వేములవాడ, ఫిబ్రవరి 12 : కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ప్రభుత్వం, బీఆర్ఎస్ పార్టీ దాగుడుమూతలు ఆడుతున్నాయని కరీంనగర్ పార్లమెంట్ సభ్యుడు, బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్ అన్నారు. ప్రజాహిత యాత్రలో భాగంగా సోమవారం సాయంత్రం ఆయన వేములవాడ పట్టణంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బండి సంజయ్ మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో అక్రమాలపై కాంగ్రెస్ ప్రభుత్వం సిబిఐ విచారణ ఎందుకు కోరడం లేదని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరిట కెసిఆర్ ప్రభుత్వం లక్ష కోట్ల రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేసిందని కేసీఆర్ ఆస్తులను జప్తు చేసి కాళేశ్వరం సంబంధించిన సొమ్మును రికవరీ చేసే దమ్ము కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉందా అని ఆయన సవాల్ విసిరారు. రాజీవ్ రహదారిపై సభా సంఘం మాదిరిగా డ్రామాలొద్దని, మేడిగడ్డ ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థను బెదిరించి స్వయం ప్రకటిత మేధావిగా చెప్పుకునే ఓ నాయకుడు తన కుటుంబ సభ్యులకు సబ్ కాంట్రాక్ట్ తీసుకున్నారని, క్వాలిటీ లేకుండా పనులు చేసి పిల్లర్లు వంగిపోయి ప్రమాదానికి కారకుడు ఆ స్వయం ప్రకటిత మేధావే అని అన్నారు. సదరు స్వయం ప్రకటిత మేధావిపై తక్షణమే క్రిమినల్ కేసులు పెట్టాలని, కాళేశ్వరం ప్రాజెక్టులో నాణ్యత లోపంతో పనులు చేసి ప్రజల సొమ్ములు స్వాహా చేసిన వారిపై కేసులు పెట్టి సొమ్మును రికవరీ చేసి నిజాయతీని నిరూపించుకోవాలని బండి సంజయ్ డిమాండ్ చేశారు. రెండు పార్టీలు కలిసి అసెంబ్లీని టైంపాస్ వ్యవహారంగా మారుస్తున్నారని అన్నారు.


వేములవాడలో పాదయాత్ర చేస్తున్న బండి సంజయ్

ఆటో నడిపిన బండి సంజయ్

ప్రజాహిత యాత్రలో భాగంగా కరీంనగర్ ఎంపీ బండి సంజయ్ సోమవారం సాయంత్రం వేములవాడలో ఆటో నడిపించారు. యాత్ర సందర్భంగా పలువురు ఆటో డ్రైవర్లు బండి సంజయ్‌ను కలిసి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కారణంగా ఉపాధి కోల్పోయి రోడ్డున పడ్డామని మొరపెట్టుకున్నారు. ఆటో డ్రైవర్ల సమస్య పరిష్కారానికి ప్రయత్నం చేస్తామని ఆటో డ్రైవర్లకు అండగా ఉంటామని బండి సంజయ్ ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ, నాయకుడు చెన్నమనేని వికాస్ తదితరులు పాల్గొన్నారు.

భూకబ్జా కేసులో పోలీసు కస్టడీకి శ్రీపతిరావు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: భూకబ్జా కేసులో అరెస్టు అయి కరీంనగర్ జిల్లా జైలులో ఉన్న తోట శ్రీపతిరావును కరీంనగర్ రూరల్ పోలీసులు సోమవారం కస్టడీకి తీసుకున్నారు. కరీంనగర్‌లోని వివేకానందపురి కాలనీలో అనుమాండ్ల రవీందర్‌కు చెందిన నిర్మాణంలో ఉన్న భవనం 8 పిల్లర్లను కూల్చివేసిన ఘటనకు సంబంధించిన కేసులో ఈ నెల 6న తోట శ్రీపతిరావును పోలీసులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచారు. జడ్జి ఆదేశాలతో 14 రోజుల రిమాండ్‌కు తరలించారు. ఈ కేసుకు సంబంధించి తోట శ్రీపతిరావును మరింత లోతుగా విచారించేందుకు అనుమతి ఇవ్వాలని పోలీసులు కోర్టులో పిటిషన్ దాఖలు చేయగా కస్టడీకి కోర్టు అనుమతించింది. సోమవారం ఉదయం 10:30 గంటల నుంచి మంగళవారం మధ్యాహ్నం 3 గంటల వరకు కస్టడీకి అనుమతించినట్లు సమాచారం. శ్రీపతిరావును కస్టడీకి తీసుకుని పోలీసులు అతడి ఇంటికి వెళ్లి సోదాలు జరిపి పలు కీలకమైన డాక్యుమెంట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది.


శ్రీపతిరావును అతని ఇంటిలో సోదాలకు తీసుకువెళ్తున్న పోలీసులు

రాజన్న సేవలో ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్

వేములవాడ, ఫిబ్రవరి 12: వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారిని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య దర్శించుకున్నారు. సోమవారం ఆయన కుటుంబ సమేతంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు సంప్రదాయం ప్రకారం ఆహ్వానం పలికి పూజల అనంతరం నాగిరెడ్డి మండపంలో ఆశీర్వచనం గావించారు. ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు ప్రసాదం అందజేశారు. ఆలయ ప్రొటోకాల్ సూపరింటెండెంట్ శ్రీరాములు వెంట ఉన్నారు.

రాష్ట్రస్థాయి ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లాకు ఛాంపియన్‌షిప్


ట్రోఫీని అందుకుంటున్న కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్టు

కరీంనగర్ స్పోర్ట్స్, ఫిబ్రవరి 12: తెలంగాణ రాష్ట్రస్థాయి 56వ సీనియర్ ఖోఖో పోటీల పురుషుల ఛాంపియన్‌షిప్‌ను ఉమ్మడి కరీంనగర్ జిల్లా జట్టు సాధించింది. నల్గొండ జిల్లా భువనగిరిలో ఈనెల 8 నుంచి 11వరకు తెలంగాణ ఖోఖో అసోసియేషన్ నిర్వహించిన రాష్ట్ర స్థాయి సీనియర్స్ మహిళలు, పురుషుల ఖోఖో పోటీల్లో ఉమ్మడి జిల్లా జట్టు ఛాంపియన్‌గా నిలిచింది. ఈ పోటీల్లో జిల్లా జట్టు మహబూబ్‌నగర్, ఖమ్మం, మెదక్, జట్లపై గెలుపొంది సెమి ఫైనల్స్‌లో వరంగల్ జిల్లా జట్టుతో తలపడి 5 పాయింట్ల తేడాతో ఫైనల్స్‌లో ప్రవేశించిందని జిల్లా ఖోఖో సంఘం అధ్యక్ష, కార్యదర్శులు నటరాజ్ రవి, వై మహేందర్‌రావు తెలిపారు. ఆదివారం రాత్రి పోరాపోరిగా సాగిన పురుషుల ఫైనల్స్‌లో కరీంనగర్ జట్టు రంగారెడ్డి జట్టుతో తలపడి ఒక్కపాయింట్ తేడాతో గెలుపొందిందని వారు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఛాంపియన్‌గా నిలిచిన జట్టును డీవైఎస్ఓ కీర్తి రాజవీరు, జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ అధ్యక్ష,కార్యదర్శులు నందెల్లి మహిపాల్, గసిరెడ్డి జనార్దన్‌రెడ్డి ఖోఖో సంఘం ప్రతినిధులు చిట్టి తిరుపతిరెడ్డి, డాక్టర్ వేల్పుల కుమార్, ఈ నరేష్, ఎ రవీందర్, వంగపల్లి సూర్యప్రకాశ్, ఖో ఖో కోచ్‌లు వెంకటేష్, సభ్యులు ఎస్ కె మోయినోద్దిన్, మంగ సంతోష్, బి శేఖర్, కట్ట సంతోష్, రాదారాణి, రేణుక, కవిత, మానస, ఆర్ఐ కుమార్, ఎస్ఎ రమేశ్, పండుగ ఆనంద్, ప్రసాద్, శ్రీలత, జ్యోతి, జలందర్, లక్ష్మన్, నవీన్ తదితరులు అభినందించారు.

యువకుడి హత్య


శ్రీధర్(ఫైల్)

వేములవాడ టౌన్, ఫిబ్రవరి 12: వేములవాడ పట్టణంలోని అర్బన్ కాలనీకి చెందిన కురుకుంట్ల శ్రీధర్ (25) అనే యువకుడు హత్యకు గురయ్యాడు. శ్రీధర్ కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. శ్రీధర్ రాజన్న ఆలయ ధర్మగుండం వద్ద జంగమ పూజారిగా జీవనోపాధి పొందుతున్నాడు. అదే కాలనీకి చెందిన అతడి స్నేహితుడు బాబు ఆదివారం రాత్రి శ్రీధర్ ఇంటికి వచ్చి పార్టీ ఉందని తీసుకెళ్లాడు. శ్రీధర్ ద్విచక్ర వాహనంపై జర్మనీ గెస్టహౌస్ సమీపంలోని ఖాళీ ప్రాంతానికి వెళ్లారు. ఇంట్లో నుంచి వెళ్లిన శ్రీధర్ తిరిగి రాకపోవడంతో అతడి భార్య యామిని ఫోన్ చేసింది. తీయక పోవడంతో భయాందోళనకు గురైంది. తెల్లవారుజామున శ్రీధర్ హత్యకుగురయ్యాడని తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. మృతుడికి భార్య యామిని, కుమారుడు ఉన్నారు.

సంఘటన స్థలాన్ని పరిశీలించిన ట్రైనీ ఎస్పీ

శ్రీధర్ హత్యకు గురైన సంఘటన వేములవాడ పట్టణంలో సంచలనంగా మారడంతో ట్రైనింగ్ ఎస్పీ రాహుల్‌రెడ్డి, డీఎస్పీ నాగేంద్రచారి, టౌన్ సీఐ కరుణాకర్ సంఘటన స్థలానికి చేరుకుని హత్య జరిగిన తీరును పరిశీలించారు. మృతుడి భార్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. సంఘటన స్థలం వద్ద మృతుడి కుటుంబ సభ్యుల రోదించడంతో విషాదఛాయలు అములుకున్నాయి.

ఎక్సైజ్ శాఖలో సీఐలు, ఎస్ఐల బదిలీలు

కరీంనగర్ క్రైం, ఫిబ్రవరి 12: లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో దీర్ఘకాలంగా ఒకే చోట విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులను బదిలీ చేయాలని కేంద్ర ఎన్నికల కమిషన్ ఆదేశాలతో ఎక్సైజ్ శాఖలో భారీ సంఖ్యలో సీఐలు, ఎస్ఐల బదిలీలు జరిగాయి. ఈ మేరకు ఎక్సైజ్ శాఖ కమిషనర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కరీంనగర్ అర్బన్ ఎక్సైజ్ సీఐ పి.తాతాజీని పరకాలకు బదిలీ చేశారు. హుజూరాబాద్ సీఐ దుర్గా భవానిని హన్మకొండకు, జగి త్యాల సీఐ ఎస్.ప్రభాకర్ రెడ్డిని వరంగల్ అర్బన్‌కు, సుల్తానాబాద్ సీఐ సీహెచ్ శామ్యూల్ ఆనంద్ రావును వరంగల్ అర్బన్ డీటీఎఫ్ సీఐగా, కరీంనగర్ రూరల్ సీఐ ఎం తిరుమలతను హన్మకొండ ఐఎంఎల్‌డిపో-1కు, రామగుండం సీఐ ఎస్ రమేష్‌ను ఖమ్మం ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, సత్తుపల్లి సీఐ వి రాజశేఖర్‌రావును వేములవాడకు బదిలీ చేశారు. వేములవాడ సీఐ జి.రామును కరీంనగర్ అర్బన్‌కు, జగిత్యాల సీఐ ఎస్ అశోక్‌కుమార్‌ను కరీంనగర్ రూరల్‌కు, లక్సెట్టిపేట సీఐ ఎస్ బాబాను తిమ్మాపూ ర్‌కు, వరంగల్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో సీఐలుగా పనిచేస్తున్న టి శ్రీనివాసులును హుజూరాబాద్‌కు, ఎం మాధవిలతను జమ్మికుంటకు, ఆసిఫాబాద్ సీఐ సయ్యద్ మోసిన్‌అలీని కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, నేలకొండపల్లి సీఐ కె పోశెట్టిని పెద్దపల్లికి, పాల్వంచ సీఐ గురునాథ్‌ను సుల్తానాబాద్‌కు, కాగజ్‌నగర్ సీఐ సీహెచ్ మంగమ్మను రామగుండంకు బదిలీ చేశారు. ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ మంథనికి, హరితబయో డిస్టిల్లరీ సీఐ ప్రియాంకను పెద్దపల్లికి, ఖమ్మం ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ వై సర్వేశ్వర్‌రావును జగిత్యాలకు, ఊట్నూర్ సీఐ టి మహేందర్ సింగ్‌ను ధర్మపురికి, పెద్దపల్లి డీటీఎఫ్ సీఐ వినోద్ రాథోడ్‌ను మెట్‌పల్లికి, ఇచ్చోడ సీఐ సీహెచ్ రాజమౌళిని జగిత్యాల డీటీఎఫ్‌కు, పెద్దపల్లి సీఐ ఎం శ్రీనివాస్‌ను ఎల్లారెడ్డిపేటకు, ధర్మపురి సీఐ ఏ ముత్యంను ఆదిలాబాద్ డీటీ ఎఫ్‌కు, జమ్మికుంట సీఐ ఎండీ అక్బర్ హుస్సేన్‌ను ఆదిలాబాద్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు బదిలీ అయ్యారు. మంథని సీఐ జి గురువయ్యను మంచిర్యాలకు, తిమ్మాపూర్ సీఐ జె ఇంద్రప్ర సాద్‌ను బెల్లంపల్లికి, ఎల్లారెడ్డిపేట సీఐ ఎంపీఆర్ చంద్రశేఖర్‌ను హైదరాబాద్ ఎస్‌టీఎఫ్‌కు, మెట్‌పల్లి సీఐ ఎం రాధను తూర్పాన్ డిస్టిల్లరికి, కరీంనగర్ ఎన్‌ఫోర్స్ మెంట్ సీఐ కె విజయ్ కుమార్‌ను ప్రియాంక డిస్టిల్లరీస్‌కు, జమ్మికుంట ఎక్సైజ్ ఎస్ఐ ఎం.రమాదేవి వరంగల్ అర్బన్ డీటీఎఫ్ ఎస్ఐగా బదిలీ చేశారు. సిరిసిల్ల ఎస్ఐ కె.విజేందర్ కొత్తగూడెంకు, లక్సెట్టిపేట ఎస్ఐ ఏఆర్‌సీ జాన్ రాబర్ట్‌ను కరీంనగర్ అర్బన్, చెన్నూర్‌లో పనిచేస్తున్న కే లక్ష్మణ్‌ను కరీంనగర్ రూరల్‌కు, ఖాజీపేటలో పనిచే స్తున్న ఎం.సౌమ్యను జమ్మికుంటకు, మెట్‌పల్లి ఎస్ఐ ఎంఏ మజీద్‌ను కరీంనగర్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌కు, కరీంనగర్ రూరల్ ఎస్ఐ కె.స్వప్నను జగిత్యాలకు, కరీంనగర్ అర్బన్ ఎస్ఐ కె.నరేష్‌ను ధర్మపురికి, ఎచోడ ఎస్ఐ సీహెచ్ లక్ష్మన్‌కుమార్‌ను మెట్‌పల్లికి, ధర్మపురి ఎస్ఐ కె.శ్రీనివాస్‌ను వేములవాడకు, పెద్దపల్లి ఎస్ఐ మనీషా రాథోడ్‌ను మంచిర్యాలకు, రామగుండం ఎస్ఐ జి.శారదను బెల్లంపల్లికి, పెద్దపల్లి ఎస్ఐ బి.ప్రభాకర్‌ను ఔసీపీ సాలూరకు, జగిత్యాల ఎస్ఐ ఎన్.సరితను మిర్‌దొడ్డికి, కరీంనగర్ అర్బన్ ఎస్ఐ ఆర్.రూపను హుస్నాబాద్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

ఆత్మహత్యాయత్నం చేసిన వివాహిత చికిత్స పొందుతూ మృతి


పల్లె రమణ(ఫైల్)

ముస్తాబాద్, ఫిబ్రవరి 12: కన్న కొడుకుకు ఉద్యోగం రాలేదని ఓ తల్లి పురుగుల మందు తాగి చికిత్స పొందుగూ మృతి చెందిన సంఘటన సోమవారం జరిగింది. ఎస్‌హెచ్‌వో వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం మండలోని తెర్లమద్ది గ్రామానికిచెందిన పల్లె రమణ (40) అనే మహిళ తన కొడుకుకు ఉద్యోగం రావట్లేదని మనస్తాపం చెంది రెండు రోజుల క్రితం పురుగుల మందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే మండల కేంద్రంలోని ఓ ప్రైవేటు అసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి పరిస్థితి విషమంగా ఉండడంతో ఎల్లారెడ్డిపేటకు తరలించినట్లు తెలిపారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించడంతో సోమవారం మృతిచెందినట్లు తెలిపారు. రమణకు భర్త రవీందర్, కొడుకులు ఉన్నారు.

నారాయణపూర్‌ను రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలి

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12: మండలంలోని నారాయణపూర్‌ను ప్రత్యేకంగా రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయాలని మాజీ సర్పంచ్ అన్నమనేని రఘుపతి రావు కలెక్టర్‌ను కోరారు. ఈ మేరకు సోమవారం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కొదురుపాక గ్రామ పంచాయతీలో కొనసాగుతున్న నారాయణపూర్‌ను 1981లో వేరుచేసి ప్రత్యేకంగా గ్రామపంచాయతీగా ఏర్పాటుచేశారని, అయితే రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయకపోవడం వలన సర్టిఫికెట్లలో ఇప్పటికీ కొదురుపాక నారాయణపూర్‌గా వస్తోందన్నారు. దీని వలన 2500 మంది జనాభా కలిగిన తమ గ్రామంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేయడానికి 2003లో తగిన ప్రతిపాదనలు తయారు చేశారని కానీ రెండు గ్రామాల మధ్య సరిహద్దుల విషయంలో ఏకాభిప్రాయం కుదరలేదని అప్పటి ఆర్డీవో రెండు గ్రామాల పెద్దల అభిప్రాయాన్ని కూడా సేకరించారని కానీ ఇప్పటివరకు ప్రత్యేక రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు కాలేదని అన్నారు. ఇప్పటికైనా విచారణ జరిపి తమ గ్రామాన్ని రెవెన్యూ గ్రామంగా ఏర్పాటు చేసి ప్రజల ఇబ్బందులను తొలగించాలని కోరారు.

తహసీల్దార్ బాధ్యతల స్వీకరణ

కమాన్‌పూర్, ఫిబ్రవరి 12 : మండల నూతన తహసీల్దార్‌గా మహమ్మద్ అరిఫుద్దీన్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జగిత్యాల జిల్లా గొల్లపల్లి మండలం నుంచి కమాన్‌పూర్ మండలానికి బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా కార్యాలయ సిబ్బంది, అధికారులు పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు.

జూలపల్లి ఎస్‌ఐ బాధ్యతల స్వీకరణ

జూలపల్లి, ఫిబ్రవరి 12 :జూలపల్లి ఎస్‌ఐగా శ్రీధర్ సోమవారం పోలీస్ స్టేషన్‌లో బాధ్యతలు స్వీకరించారు. జిల్లాలోని పొత్కపల్లి పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించిన ఎస్‌ఐ శ్రీధర్‌ను సాధారణ బదిలీల్లో భాగంగా జూలపల్లికి బదిలీ చేశారు. ఈసందర్భంగా ఎస్‌ఐ శ్రీధర్ మాట్లాడుతూ ప్రజలకు అందుబాటులో ఉంటూ నూతన టెక్నాలజీని ఉపయోగించి నేరాల నియంత్రణకు కృషి చేయనున్నట్లు పేర్కొన్నారు.

ఇటుక బట్టీల్లో అధికారుల విచారణ

- లైంగిక వేధింపులంటూ వలస కార్మికురాలి ఆరోపణ
- స్వగ్రామం వెళ్లేందుకేనని తేల్చిన అధికారులు



ఇటుక బట్టీలో విచారణ చేపడుతున్న అధికారులు

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 12 : మండలంలోని రాఘవపూర్‌లోని ఓ ఇటుక బట్టీలో అధికారులు సోమవారం విచారణ చేపట్టారు. లైంగిక వేధింపులంటూ మహిళ చేసిన ఆరోపణల్లో నిజం లేదని తేల్చారు. వివరాల్లోకి వెళితే గ్రామ పరిధిలోని ఎస్‌బీఐ ఇటుకబట్టీలో పనిచేసేందుకు ఒడిశా నుంచి రోహిత్ తన భార్య వినోద, కొడుకుతో వలసవచ్చాడు. 50 రోజుల క్రితం తన చిన్ననాన్నకు ఆరోగ్యం బాగాలేదని చెప్పి ఒడిశా రాష్ట్రానికి వెళ్లిన రోహిత్ తిరిగిరాలేదు. దీంతో భర్త వద్దకు వెళ్లేందుకు రోహిత్ భార్య వినోద బంధువుల సూచన మేరకు ప్రణాళిక రూపొందించింది. ఇటుక బట్టీల యజమానులు లైంగికంగా వేధిస్తున్నారని వీడియో రికార్డు చేసి వాట్సాప్ ద్వారా కుటుంబ సభ్యులకు పంపించింది. వారు ఒడిశా రాష్ట్రంలోని ఎన్‌జీవో, అధికారులకు వీడియోను పంపించడంతో జిల్లా ఉన్నతాధికారులకు వీడియో చేరింది. దీంతో కలెక్టర్ ఆదేశాల మేరకు అధికారులు విచారణ జరుపగా ఇంటికి వెళ్లేందుకు ఇలా చేశానని బాధితురాలు పేర్కొంది. దీంతో వినోద, ఆమె కుమారుడితో పాటు బంధువైన యువతిని అధికారుల సమక్షంలో స్వగ్రామానికి రైలు ద్వారా పంపించారు. విచారణలో పెద్దపల్లి సీఐ కృష్ణ, డీఎల్‌పీవో వేణుగోపాల్, సీడీపీవో కవిత, చైల్డ్‌లైన్ కోఆర్డినేటర్ ఉమాదేవి, డీసీపీవో కమలాకర్, కార్మికశాఖ ఇన్‌చార్జి అధికారి రాంమ్మోహన్, బసంత్‌నగర్ ఎస్‌ఐ వెంకటేష్, బీఆర్‌బీ సుగుణ, ఎంపీవో సుదర్శన్, పంచాయతీ కార్యదర్శులు ప్రకాష్, శ్రీధర్‌ల పాల్గొన్నారు.

ఆలయంలో నాయకుల ప్రత్యేక పూజలు

జూలపల్లి, ఫిబ్రవరి 12 : మండలంలోని పెద్దాపూర్‌లోగల శ్రీమల్లికార్జునస్వామి దేవాలయ ధ్వజస్తంభ వార్షికోత్సవం సందర్భంగా అఖిలభారత యాదవ మహాసభ నాయకులు సోమవారం శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి వారు మొక్కులు తీర్చుకున్నారు. అక్కడ ఏర్పాటుచేసిన అన్నదాన కార్యక్రమంలో పాల్గొని భక్తులకు భోజనం వడ్డించారు. ఆలయ అభివృద్ధికిగాను వారు రూ.5116 విరాళంను ఆలయ కమిటీ నిర్వాహకులకు అందజేసారు. ఈ కార్యక్రమంలో నాయకులు సందనవేని రాజెందర్, తమ్మడవేని ఓదెలు, మాజీ సర్పంచ్ దారబోయిన నర్సింహయాదవ్, భక్తులు పాల్గొన్నారు.

26న అవిశ్వాసంపై ఓటింగ్

ఓదెల, ఫిబ్రవరి 12 : మండలంలోని పొత్కపల్లి వ్యవసాయ సహకార సంఘం సింగిల్‌విండో చైర్మన్ ఆళ్ల శ్రీనివాస్‌రెడ్డిపై ప్రవేశపెట్టిన అవిశ్వాస తీర్మానంపై ఈనెల 26న ఓటింగ్ నిర్వహిస్తున్నట్లు ప్రాథమిక వ్యవసాయ సహకార అధికారిణి శ్రీమాల సోమవారం నోటీసులు జారీ చేశారు. ఈనెల 7న 10మంది డైరెక్టర్‌లు కలిసి చైర్మన్, వైస్‌చైర్మన్‌పై డిప్యూటీ రిజిస్ట్రార్‌కు అవిశ్వాస తీర్మాన కాపీని అందజేశారు. 26న మధ్యాహ్నం 1.30గంటలకు పొత్కపల్లి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయంలో రిజిస్ట్రార్ అధ్యక్షతన ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి కల్చరల్, ఫిబ్రవరి 12 : రాష్ట్ర స్థాయి సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ పోటీలలో ప్రతిభ కనబర్చి తృతీయ బహుమతి సాధించిన ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అభినందించారు. ఈనెల 10న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, హయత్‌నగర్, రంగారెడ్డి జిల్లాలో విద్యాశాఖ, తెలంగాణ సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన స్టేట్‌లెవల్ సోషల్ స్టడీస్ టాలెంట్ టెస్ట్ పోటీలలో తృతీయ బహుమతి సాధించిన అంతర్గాం కేజీబీవీ పాఠశాలకు చెందిన ఏ వైష్ణవి, జూలపల్లి జడ్పీ హెచ్‌ఎస్ బాలికల పాఠశాల విద్యార్థిని ఉప్పుల చారు భాషినిలను సోమవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో కలెక్టర్ అభినందించి, వారికి మెడల్స్, ప్రశంస పత్రాలను అందజేశారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు విద్యతోపాటు క్రీడల్లో జాతీయ, రాష్ట్రస్థాయిలో రాణించి జిల్లాకు, పాఠశాలకు మంచిపేరు తీసుకురావాలని విద్యార్థులకు కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో జీసీడీవో కవిత, సోషల్ ఫోరం ప్రెసిడెంట్ మార రమేష్, సభ్యులు జె.సత్యనారాయణ, ఉపాధ్యాయులు కే.శ్రీనివాస్‌రెడ్డి, సరోజశర్మ, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సైన్స్‌ఫిక్షన్ కథల పోటీల్లో రాష్ట్ర స్థాయి ప్రథమ బహుమతి

ధర్మారం, ఫిబ్రవరి12: ఇటీవల హైదరాబాద్‌లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన రాష్ట్ర స్థాయిలో లీలావతి దవే సైన్స్ ఫిక్షన్ కథల పోటీల్లో ధర్మారం మండలం నర్సింహులపల్లి హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న వేల్పుల శ్రీలత ప్రథమ బహుమతి లభించింది. పోటీ ఫలితాలను హైదరాబాద్‌లో జరుగుతున్న బుక్‌ఫేర్‌లో చిల్డ్రన్స్ ఎడ్యుకేషనల్ అకాడమీ, బాల చెలిమి గ్రంథాలయ అధ్యక్షుడు మణికొండ వేదకుమార్ ప్రకటించారు. అదేవిధంగా పాఠశాలలో పదో తరగతి చదువుతున్న బొట్ల లక్ష్మిగణేష్‌కు కూడా ప్రత్యేక బహుమతి లభించింది. సోమవారం పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేసి సైన్స్ ఫిక్షన్ కథల పోటీల్లో ప్రథమ బహుమతి పొందిన వేల్పుల శ్రీలతను ప్రోత్సాహక తెలుగు ఉపాధ్యాయుడు కందుకూరి భాస్కర్‌ను హెచ్‌ఎం, ఉపాధ్యాయులు అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం నాగుల రవీందర్, ఉపాధ్యాయులు రమేష్, ఆంజనేయులు, శ్రీధర్‌రెడ్డి, స్వరాజ్య లక్ష్మి, పుష్పలత, జ్యోతి, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులకు శిక్షణ ఇచ్చేందుకు ఒప్పందం



ఒప్పంద పత్రాలపై సంతకం చేస్తున్న ప్రిన్సిపాల్

రామగిరి, ఫిబ్రవరి 12: మంథని జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాల తెలంగాణ అకాడమి స్కిల్ అండ్ నాలెడ్జ్(టాస్క్) సహకారంతో ఎస్‌ఏపీ ఎడ్యునెట్‌తో సోమవారం చారిత్రాత్మక ఒప్పందం కుదుర్చుకుంది. టాస్క్ సీఈవో శ్రీకాంత్‌సింహ సమక్షంలో మంథని కళాశాల ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ఎస్‌ఏపీ డైరెక్టర్ ఆశీష్‌ఆరోరా మధ్య ఎంవోయులపై సంతకాలు చేశారు. కళాశాలలో చదివే విద్యార్థులకు ఒప్పందం కింద ఉద్యోగాలకు శిక్షణ ఇవ్వడమే లక్ష్యంగా ఎస్‌ఏపీ పనిచేస్తుంది. తెలంగాణ వ్యాప్తంగా 15 కేంద్రాలను టాస్క్ ఎంపిక చేయగా అందులో మంథని ఇంజనీరింగ్ కళాశాల ఒకటి. కార్యక్రమంలో ఎస్‌ఏపీ విభాగ అధిపతి సాగరిక బోస్‌లు, విభాగాల అధిపతులు దుర్గారావ్, రాంనరేష్, రవీకుమార్, గంగాప్రసాద్, ప్రదీప్‌రెడ్డి, రవీందర్, బిదన్, షెక్‌వాహబ్, పాల్గొన్నారు.

ప్రత్యేక రైలులో అయోధ్యకు బయలుదేరిన బీజేపీ నాయకులు

అంతర్గాం, ఫిబ్రవరి 12: రామగుండం పట్టణంలోని రైల్వే స్టేషన్ నుంచి జిల్లాకు చెందిన బీజేపీ నాయకులు బాలరాముని దర్శనానికి సోమవారం పెద్ద ఎత్తు తరలివెళ్లారు. కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలు రామగుండంకు చేరుకోగా నియోజవర్గానికి చెందిన బీజేపీ శ్రేణులు, రామ భక్తులు బీజేపీ నాయకురాలు కందుల సంధ్యారాణిపోచం ఆధ్వర్యంలో బయలుదేరారు. జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున తరలిరావడంతో రామగుండం రైల్వే స్టేషన్ సందడిగా మారింది. అయోధ్యకు తరలివెళ్లిన వారిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు చందుపట్ల సునీల్‌రెడ్డి, దుగ్యాల ప్రదీప్‌రావు, వీ రామచంద్రం, బీజేపీ అనుబంధ సంఘాల నాయకులు విజయ్‌మోహన్, మహేష్ ఉన్నారు.

మంథని, ఫిబ్రవరి 12: అయోధ్యలోని శ్రీరామ మందిర దర్శనానికి మంథని బీజేపీపార్టీ శ్రేణులు సోమవారం తరలివెళ్లారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సునీల్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఏర్పాటు చేసిన ప్రత్యేక రైలులో బయలుదేరి వెళ్లారు. ఈ కార్యక్రమంలో నాయకులు నాంపెల్లి రమేష్, బూడిద తిరుపతిల ఆధ్వర్యంలో మంథని నియోజకవర్గం నుంచి దాదాపు 100 మంది ఉన్నారు.

ఘనంగా మార్కండేయ జయంతి వేడుకలు



పెద్దబొంకూర్‌లో జయంతి వేడుకలు నిర్వహిస్తున్న పద్మశాలీలు



కమాన్‌పూర్‌లో..

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 12: మండలంలోని పెద్దబొంకూరులో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ మహర్షి జయంతి సందర్భంగా శివాలయంలో మహర్షి చిత్రపటానికి పూలమాలలు వేసి వేడుకలు నిర్వహించారు. పద్మశాలి సంఘం గ్రామ అధ్యక్షుడు మిట్టపల్లి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మిట్టపల్లి కనుకయ్య,ఎంపీటీసీ మిట్టపల్లి వసంత వెంకటేషం, మిట్టపల్లి రాజేశం, పెండం భిక్షపతి, నాగుల మల్లేశం, వేముల భూమయ్య, బైరి నంబయ్య, బైరి వెంకటేషం, వేముల శ్రీనివాస్, సీపెల్లి శ్రీనివాస్, గంటి నందం, కలవేన సంజీవ్, సతీష్ పాల్గొన్నారు.

ఎలిగేడు, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలోని అంబేద్కర్‌చౌక్‌లో మార్కండేయ జయంతిని మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మాజీ సర్పంచ్ బూర్ల సింధూజ, వెంగల్‌దాస్ రాజమౌళి, మాజీ ఎంపీటీసీ బూర్ల సత్యనారాయణ, కోడూరి కౌలాసం, మామిడాల రమేష్, బూర్ల వెంకటసత్యం, బింగి రాజు, సత్యనారాయణ పాల్గొన్నారు.

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 12: పద్మశాలి సేవా సంఘం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం మార్కండేయ జయంతి అత్యంత భక్తి శ్రద్ధలతో జరిగింది. సంఘం కార్యాలయంలో మార్కండేయ మహర్షి చిత్ర పటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో పట్టణ పద్మశాలి సేవా సంఘం అధ్యక్షుడు దేవనపల్లి చక్రపాణి, ప్రధాన కార్యదర్శి సాంబారి రాజేష్, వర్కింగ్ ప్రెసిడెంట్ కుర్మ శ్రీనివాస్, కుమారస్వామి, రాజేందర్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఓదెల, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలో సోమవారం పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతి వేడుకలను నిర్వహించారు. మేర్గు భీష్మాచారి, ఇప్పలపల్లి వెంకటేశ్వర్లు, పడ్డెపల్లి పరంధాములు, క్యాతం వెంకన్న, క్యాతం శ్రీనివాస్, క్యాతం రాజేంద్ర ప్రసాద్, అరకాల నారాయణ, కడెర్ల రమేష్, క్యాతం రవిందర్ పాల్గొన్నారు.

కమాన్‌పూర్, ఫిబ్రవరి 12 : మండల కేంద్రంలో పద్మశాలి సేవా సంఘం ఆధ్వర్యంలో భక్త మార్కండేయ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. కార్యక్రమంలో పద్మ శాలి సేవా సంఘం అధ్యక్షుడు కుందారపు బాపు, గ్రామ ప్రత్యేక అధికారి శేషయ్య, మాజీ సర్పంచ్ కటకం రవీందర్, గుమ్మడి శ్రీనివాస్, పడాల మల్లేష్, కొండి అనిల్, తవటం బాలకృష్ణ, కుందారపు మల్లేష్, నరసయ్య తదితరులు ఉన్నారు.

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12: భక్త మార్కండేయ జయంతిని పురస్కరించుకొని సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని భక్తమార్కండేయ ఆలయంలో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో వల్స నీలయ్య, వలస భాస్కర్, పెగడ ఆంజనేయులు, పెగడ కిషన్, రాజమౌళి, నల్ల శంకరయ్య, లింగమూర్తి,సతీష్ పాల్గొన్నారు.



సీఎంపీఎఫ్ కుంభకోణంపై సీబీఐ విచారణ జరిపించాలి

- రాంచి ధర్నాలో కొత్తకాపు లక్ష్మారెడ్డి డిమాండ్



ధర్నాలో మాట్లాడుతున్న కొత్తకాపు లక్ష్మారెడ్డి

గోదావరిఖని, ఫిబ్రవరి 12: అఖిల భారతీయ కథాన్ మజ్దూర్ సంఘ్(బీఎంఎస్) ఆధ్వర్యంలో జార్ఖండ్ రాష్ట్రంలోని రాంచీ సీఎంపీఎఫ్ ప్రాంతీయ కార్యాలయం ముందు సోమవారం మహాధర్నా జరిగినట్టు సింగరేణి కోల్‌మైన్స్ కార్మిక సంఘ్(బీఎంఎస్) అధ్యక్షులు యాదగిరి సత్తయ్య తెలిపారు. ఈ సందర్భంగా బొగ్గు పరిశ్రమల ఇన్‌చార్జి, సీఎంపీఎఫ్ ట్రస్టీ బోర్డు సభ్యులు కొత్తకాపు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ సీఎంపీఎఫ్‌లో జరిగిన రూ.900కోట్ల కుంభకోణంపై సీబీఐ ద్వారా విచారణ జరిపించాలని, బాధ్యులైన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్టు తెలిపారు. బొగ్గు గని కార్మికుల భవిష్య నిధి భద్రంగా ఉంచడం కోసం నిరంతరం పోరాటం చేస్తుందని, దేశంలో ప్రతి కార్మికునికి భరోసాగా ఉండే భవిష్య నిధిపై కుంభకోణాలకు పాల్పడిన అధికారులపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు.

సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 12: ఈనెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మె పోస్టర్‌ను సోమవారం ఇఫ్టూ కార్యాలయంలో అనుబంధ సింగరేణి కాలరీస్ కాంట్రాక్టు యూనియన్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. కేంద్రంలోని ఎన్‌డీఏ ప్రభుత్వం రైతు, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా అన్ని కార్మిక సంఘాలు దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చినట్టు ఆర్జీ రీజియన్ అధ్యక్షురాలు బుచ్చమ్మ పేర్కొన్నారు. కాంట్రాక్టు కార్మికులు సమ్మెను విజయవంతం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పద్మ, కాంతయ్య, రాజనర్సు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

జీఎం కార్యాలయంలోని డిపార్ట్‌మెంట్ల తనిఖీ



డిపార్ట్‌మెంట్లను తనిఖీ చేస్తున్న జీఎం చింతల శ్రీనివాస్

గోదావరిఖని, ఫిబ్రవరి 12: ఆర్జీ-1 ఏరియా జీఎం కార్యాలయ బిల్డింగ్‌లోని అన్ని డిపార్ట్‌మెంట్లను సోమవారం ఆర్జీ-1 జీఎం చింతల శ్రీనివాస్ తనిఖీ చేశారు. ఉద్యోగులతో మాట్లాడి వారు నిర్వహిస్తున్న పనులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ డిపార్ట్‌మెంట్లలో ఉద్యోగులు విధులు సక్రమంగా నిర్వహించాలని, సమయపాలన పాటించాలని సూచించారు. డిపార్ట్‌మెంట్లలో పనులు పెండింగ్‌లో లేకుండా వేగంగా నిర్వహించాలని, సరైన సమయంలో వారికి కేటాయించిన పనులను పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ అంకిత భావం, క్రమశిక్షణతో సమష్టిగా విధులు నిర్వహిస్తే కంపెనీ నిర్దేశించిన లక్ష్య సాధనలో భాగస్వాములం అవుతామన్నారు. అండర్‌గ్రౌండ్, ఓపెన్‌కాస్టులు, డిపార్ట్‌మెంట్లలో కూడా సమష్టిగా పని చేసినట్లయితే నిర్దేశించిన లక్ష్యాలను సులువుగా సాధించుకోగలమన్నారు. వారం రోజులుగా మల్టీ డిపార్ట్‌మెంటల్ సమావేశం నిర్వహించామని, మన సంస్థ, మన గని, మన బాధ్యతలపై ప్రతి ఒక్క ఉద్యోగికి అర్థమయ్యే విధంగా ప్రొజెక్టర్ ద్వారా వివరించామని, అదేవిధంగా మన డిపార్‌మెంట్లలో కూడా సమష్టిగా విధులను ఖచ్చితత్వంతో నిర్వహించుకోవాలని సూచించారు. జీఎం వెంట ఏజీఎం(పర్సనల్) లక్ష్మీనారాయణ, ఏజీఎం(ఐఈడీ) ఆంజనేయులు, ఎన్విరాన్‌మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, సీనియర్ పీవో బంగారు సారంగపాణి ఉన్నారు.

ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలి

రామగిరి, ఫిబ్రవరి 12: సింగరేణి కల్పించే ఉచిత శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఇన్‌చార్జ్ జీఎం రాధాకృష్ణలు కోరారు. సింగరేణి సామాజిక బాధ్యత కింద సీఎస్ఆర్ నిధులతో కృషి విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మగ్గం, డిజైనింగ్, టెక్స్‌టైల్స్ ఫ్యాబ్రిక్ డైయింగ్ ఉచిత శిక్షణ తరగతులను సోమవారం స్థానిక ఎంవీటీసీలో ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా ఏపీఏ జీఎం వెంకటేశ్వర్లు, ఆర్జీ-3 ఇంచార్జి జీఎం రాధాకృష్ణలు హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభావిత గ్రామాలకు చెందిన యువతి, యువకులకు వివిధ వృత్తి శిక్షణ కోసం 7.32 లక్షల నిధులతో ప్రణాళికతో రూపొందించి అమలు చేస్తున్నట్లు తెలిపారు.

ఈ కార్యక్రమంలో అధికారులు బైద్య, శ్రీనివాసులు, రవీందర్‌రెడ్డి, మల్లన్న, గుర్రం శ్రీహరి, విజ్ఞాన కేంద్రం ప్రిన్సిపాల్ శ్రీనివాస్, నాయకులు ఎంఆర్‌సీ రెడ్డి, కోట రవీందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఓసీపీ-3లో నూతన షావల్స్ ప్రారంభం



షావల్స్‌కు పూజలు చేస్తున్న జీఎం

యైటింక్లయిన్‌కాలనీ, ఫిబ్రవరి 12: ఓసీపీ-3 ప్రాజెక్టులో నూతనంగా కొనుగోలు చేసిన రెండు షావల్ యంత్రాలను సోమవారం ఆర్జీ-2 జీఎం సూర్యనారాయణ ప్రారంభించారు. కృషిభవన్ ఇంటర్నల్ పార్కింగ్ యార్డులో షావల్స్‌కు పూజాకార్యక్రమాలు నిర్వహించిన అనంతరం ప్రారంభించారు. ఈసందర్భంగా జీఎం సూర్యనారాయణ మాట్లాడారు. షావల్స్‌కు తుంగభద్ర, మహానదిగా పేర్లు పెట్టినట్టు తెలిపారు. గతవారం రెండు షావల్స్‌తో కలిపి మొత్తం ఐదు కొత్త షావల్స్ ప్రాజెక్టులో పనిచేయనున్నట్టు పేర్కొన్నారు. టాటా హిటాచీ కంపెనీకి చెందిన ఒక్కో షావల్ వెల 4.63 కోట్లని, దీని సామర్థ్యం 6.5 క్యూబిక్ మీటర్లని జీఎం తెలిపారు. షావల్స్‌ను సద్వినియోగం చేసుకుని ఉత్పత్తి లక్ష్యాలను సాధించే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని జీఎం సూచించారు. యంత్రాల పూర్తి పని గంటలు వినియోగించుకోవాలని, యంత్రాల నిర్వహణ సమర్థవంతంగా జరగాలని సూచించారు. ఈకార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచి సెక్రెటరీ జిగురు రవీందర్, పీవో మధుసూదన్, పీఈ రాజాజీ, మేనేజర్ రమేష్, షావల్స్ సెక్షన్‌ఇన్‌చార్జి విజేందర్‌రెడ్డి, ఎస్ఎస్ఓ షరీఫ్ మహమ్మద్, వెల్ఫేర్ ఆఫీసర్ సురేందర్, అసిస్టెంట్ పిట్ సెక్రెటరీ మహేందర్, టాటా హిటాచి ప్రతినిధులు పాల్గొన్నారు.

వ్యాన్ డ్రైవర్స్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

పెద్దపల్లి టౌన్, ఫిబ్రవరి 12: పెద్దపల్లి పట్టణంలోని పెద్దపల్లి వ్యాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఎన్నికలు సోమవారం ఏకగ్రీవంగా జరిగాయి. అసోసియేషన్ గౌరవ అధ్యక్షులుగా సయ్యద్ మస్రత్, లీగల్ అడ్వైజర్‌గా ఉప్పు రాజు, ముఖ్యసలహాదారులుగా భూత్కురి రాయమల్లు, అసోసియేషన్ అధ్యక్షులుగా భూత్కురి తిరుపతి, ప్రధాన కార్యదర్శిగా ఎండి ఆరిఫ్ అలీ, ఉపాధ్యక్షులుగా రాజబాబు, కార్యదర్శిగా ఎం సది, కోశాధికారిగా అరుణ్, కార్యవర్గ సభ్యులుగా లింగమూర్తి, ప్రభాకర్, సత్యం, మిరాజ్, మహేందర్, సంపత్‌ను ఏకగ్రీవంగా పెద్దపల్లి వ్యాన్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్‌గా ఎన్నుకున్నారు.

కోదండ రామాలయంలో ప్రత్యేక పూజలు

ధర్మారం, ఫిబ్రవరి12: ధర్మారం మండలం నర్సింహులపల్లిలో శ్రీ కోదండ రామాలయం, శివాలయం ప్రతిష్ఠ మహోత్సవ పూజలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం నిత్య అనుసంధానం, శాంతి పాఠము, నిత్యార్చన, స్థాపిత దేవత పూజ, బిల్వార్చన రుద్రాభిషేకం పూజలు చేశారు. ప్రతిష్ఠామూర్తులకు ధాన్యాధివాసము, మూలమంత్ర, దుర్గాసూక్తహోవనము తీర్థప్రసాద వితర చేశారు. ఈ పూజా కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

విగ్రహ ప్రతిష్ఠకు 'కొప్పుల'కు ఆహ్వానం

ధర్మారం, ఫిబ్రవరి 12: ధర్మారం మండలం దొంగతుర్తిలో ఈనెల 15నుంచి 19వరకు జరిగే శ్రీలక్ష్మి గోదా సమేత శ్రీవేంకటేశ్వరస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవానికి రావాలని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ దంపతులకు ఆహ్వాన పత్రాన్ని ఆలయ కమిటీ నిర్వాహకులు అందజేశారు. సోమవారం కరీంనగర్‌లో మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ నివాస గృహానికి ఆలయ నిర్వాహకులు వెళ్లి ప్రతిష్ఠ మహోత్సవానికి వారు ఆహ్వానించారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు సముద్రాల అశోక్‌రావు, కమిటీ సభ్యులు ఉన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం

సుల్తానాబాద్, ఫిబ్రవరి 12: సుల్తానాబాద్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో రేకుర్తి కంటి అసుపత్రి సౌజన్యంతో స్థానిక శ్రీవాణి డిగ్రీ కళాశాలలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించారు. సోమవారం నిర్వహించిన ఈ శిబిరంలో నేత్ర వైద్య నిపుణులు ప్రభాకర్ 150 మందికి కంటి పరీక్షలు చేయించారు. వారిలో కంటి సమస్యలు, దృష్టి లోపాలు ఉన్న వారిని పరీక్షించి 18 మందికి కంటి శుక్లాలు ఆపరేషన్ చేయాల్సిన అవసరం ఉందని గుర్తించారు. కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నోముల శ్రీనివాస్ రెడ్డి, వల్స నీలయ్య, మాటేటి శ్రీనివాస్, పిట్టల వెంకటేశం, శ్రీవాణి డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బండారి కమలాకర్ తదితరులు ఉన్నారు.

ఇళ్ల స్థలాలకు హద్దులు చూపించాలి

కాల్వశ్రీరాంపూర్, ఫిబ్రవరి 12: ఇళ్ల స్థలాలు ఇచ్చి హద్దులు చూపించలేదని, తమ సమస్యను పరిష్కరించాలని సోమవారం తహసీల్దార్ జాహెద్‌పాషాకు మండలంలోని పందిళ్ల గ్రామస్థులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పందిళ్ల గ్రామస్థులు మాట్లాడుతూ 2013లో సర్వే నెం.805, 805/3లలో ఎస్సీ, ఎస్టీ, బీసీలకు 40మందికి గతంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండగా ఇళ్ల స్థలాలకు రెండు గుంటల భూమి కేటాయించారన్నారు. 11ఏళ్లు గడుస్తున్నా ఇంతవరకు హద్దులు చూపించలేదని, ఇప్పటికైనా హద్దు చూపించాలని తహసీల్దార్‌ను కోరారు.

సమ్మక్క జాతర కమిటీ అధ్యక్షుడిగా రాజేశ్వర్‌రెడ్డి

ఎలిగేడు, ఫిబ్రవరి 12: ఎలిగేడు మండలం ఎలిగేడు, లాలపల్లి పొలిమేరలో ఉన్న సమ్మక్క-సారలమ్మ జాతర కమిటీ అధ్యక్షుడిగా సింగిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈనెల 21,22,23 తేదీల్లో సమ్మక్క-సారలమ్మ జాతర ఉత్సవాలు ఉన్నందున ఈకమిటీని వేశారు. వైస్ చైర్మన్‌గా కవంపల్లి స్వామి, ప్రధాన కార్యదర్శిగా అమ్ముల కుమారస్వామి, కోశాధికారిగా బూర్ల సత్యనారణ కమిటీ సభ్యులు ఎన్నుకున్నారు.

ఎలిగేడు ఎంపీడీవో బదిలీ

ఎలిగేడు, ఫిబ్రవరి 12: ఎలిగేడు ఎంపీడీవో బద్రి శ్రీనివాసమూర్తి రాజన్న సిరిసిల్ల జిల్లాకు బదిలీ అయ్యారు. 8ఏళ్లుగా ఆయన ఇక్కడ విధులు నిర్వహిస్తున్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ఈసీ ఆదేశాల మేరకు ఆయనను బదిలీ చేశారు.

మట్టి రవాణాతో ప్రయాణికుల ఇక్కట్లు



దుమ్ముతో నిండిపోయిన తుర్కలమద్దికుంట రహదారి

పెద్దపల్లి రూరల్, ఫిబ్రవరి 12: పెద్దపల్లి మండలం తుర్కలమద్దికుంట గ్రామం నుంచి పెద్దపల్లికి టిప్పర్‌ల ద్వారా మట్టి రవాణా జరుగుతుండడంతో రోడ్లు గుంతలమయమై తీవ్రంగా దుమ్ములేస్తోందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాల రాకపోకలతో తారు రోడ్డు గుంతలుగా ఏర్పడి దుమ్ము భారీగా కమ్ముకోవడంతో ఎదురుగా వచ్చే వాహనాలు కనబడని పరిస్థితి నెలకొంది. దీంతో రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని పలువురు ప్రయాణికులు పేర్కొన్నారు. సంబంధిత అధికారులు స్పందించి రోడ్డుపై దుమ్ము లేవకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

'దళిత బంధు పథకాన్ని కొనసాగించాలి'

పాలకుర్తి, ఫిబ్రవరి 12: దళిత బంధు పథకాన్ని కొనసాగించాలని కోరుతూ సోమవారం దళిత బంధు సాధన సమితి కమిటీ ఆధ్వర్యంలో పాలకుర్తి మండల దళిత బంధు సాధన సమితి నాయకులు స్థానిక ఎంపీడీవో గంగాల లలితకు వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో దళిత బంధు సాధన సమితి మంథని డివిజన్ అధ్యక్షుడు ఊట్ల శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు ఆర్ల స్వామి, కోశాధికారి గద్దల శంకర్, కార్యదర్శి కాదాసు తిరుపతి, పాలకుర్తి మండల అధ్యక్షుడు ఇటుకల వెంకటేష్, ప్రధాన కార్యదర్శి మడిపెల్లి కమలాకర్, మాటూరి శేశు పాల్గొన్నారు.

'అవయవ దానానికి ముందుకు రావాలి'

కోల్‌సిటీటౌన్, ఫిబ్రవరి 12: అపోహలు వీడి నేత్ర, అవయవ దేహదానాలకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని సదాశయ ఫౌండేషన్ జాతీయ ప్రధాన కార్యదర్శి సీహెచ్ లింగమూర్తి, రాష్ట్ర ప్రతినిధి కేఎస్ వాసు పిలుపునిచ్చారు. సోమవారం గోదావరిఖని మార్కండేయకాలనీలో సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర, అవయవ, దేహదానం ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నేత్ర, అవయవ, దేహదానాలపై సదాశయ ఫౌండేషన్ విస్తృతంగా అవగాహన కల్పిస్తుందన్నారు. మరణించినా నేత్రదానంతో ఈ లోకాన్ని మళ్ళీ చూసే అవకాశం దక్కుతుందని ఇద్దరు అంధులకు చూపును ప్రసాదించవచ్చన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేయించి సదాశయ డోనర్ కార్డులను అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ పద్మశాలి ఉద్యోగ సంఘం జిల్లా అధ్యక్షులు కొలిపాక సారయ్య, ఏఎస్‌ఐ శారదా, సతీష్, పరికిపండ్ల కోటేశం, కొలిపాక నగేష్‌తో పాటు పలు సంస్థల ప్రతినిధులు స్వప్న, దీప్తి, రిషిత, రమేష్, కన్నం తిరుపతి, ఈగ చంద్రయ్య పాల్గొన్నారు.

కరాటేలో షోటోకాన్ విద్యార్థుల ప్రతిభ

మంథని, ఫిబ్రవరి 12: వరంగల్ జిల్లా నర్సంపేట పద్మశాలి భవన్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి ఓపెన్ కరాటే ఛాంపియన్ షిప్ పోటల్లో మంథని షోటోకాన్ విద్యార్థులు తమ ప్రతిభను చాటి మెడల్స్ సాధించారు. మంథని షోటోకాన్ కరాటే ఇన్‌స్ట్రక్టర్ కోంఢ్ర నాగరాజు ఆధ్వర్యంలో నలుగురు విద్యార్థులు పాల్గొని కటా, కుమీతే విభాగాల్లో ప్రతిభను కనబరిచి 3 గోల్డ్ మెడల్స్, 1 సిల్వర్ మెడల్ సాధించారు. బీర ఆదిత్య తేజ బ్లాక్ బెల్ట్ కటా విభాగంలో గోల్డ్‌మెడల్, ఆల్ కలర్ బెల్ట్ కుమితే, కటా విభాగాల్లో ఒర్సు శుశృత్, ఆత్మకురి అన్ను, గోల్డ్ మెడల్స్, నివాస్ సిల్వర్ మెడల్ సాధించారు. కరాటేలో గెలుపొందిన విద్యార్థులను జేకేఏ షోటోకాన్ కరాటే రాష్ట్ర ఉపాధ్యక్షుడు, సీనియర్ ఇన్‌స్ట్రక్టర్ నూకల భానయ్య, సీనియర్ మాస్టర్స్ పర్శ బక్కయ్య, శంకర్ గౌడ్ అభినందించారు.

వన దేవతలను దర్శించుకున్న ఎంపీపీ

మంథని, ఫిబ్రవరి 12: సమ్మక్క-సారలమ్మ వన దేవతలను ఎంపీపీ కొండ శంకర్ కుటుంబ సభ్యులతో కలిసి సోమవారం దర్శించుకున్నారు. కాంగ్రెస్ చేపడుతున్న సంక్షేమ పథకాలు విజయవంతం కావాలని మొక్కులు చెల్లించుకున్నట్లు కొండ తెలి పారు. మంత్రి దుద్దిల్ల శ్రీధర్‌బాబు నేతృత్వంలో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు తెలిపారు.